వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






| హైదరాబాద్ | సంచిక : 13 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|---|







# కొత్తగా రేషన్ కార్డు వచ్చిన వారికి గుడ్‌న్యూస్..

## కొత్తగా 6 లక్షల కార్డులు - 30 లక్షల మందికి అవకాశం

ప్రజా స్వేచ్ఛ




త్వరలోనే అందుబాటులోకి ఆ సేవలు! తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయంపై వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందుతున్న సంగతి తెలిసిందే. అయితే 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో ఉన్న మొత్తం 89.95 లక్షల రేషన్ కార్డులకు అనుబంధంగా 2.81 కోట్ల మంది పేర్లు ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో నిక్షిప్తమయ్యాయి. వీరికి నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా నిబంధనల మేరకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి.

### కొత్తగా 6 లక్షల కార్డులు - 30 లక్షల మందికి అవకాశం

ఈ ఏడాది జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 6 లక్షల కొత్త కార్డులు జారీ కాగా, వాటితో కలిసి మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 95.56 లక్షలకు చేరుకుంది. ఇందులో కొత్తగా చేరిన లబ్ధిదారుల సంఖ్య 30 లక్షలు. వీరి వివరాలు త్వరలో ఆరోగ్యశ్రీ పోర్టల్‌లోకి ఎక్కించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను తగిన ఆదేశాలు జారీ చేశారు.

### 10.72 లక్షల మందికి సేవలు - రూ.1,590 కోట్ల బిల్లులు చెల్లింపు

డిసెంబరు 2023లో ప్రభుత్వం మారిన తర్వాత ఆరోగ్యశ్రీ సేవల వినియోగం మరింత పెరిగింది. మంత్రి దామోదర వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త ప్రభుత్వ పాలనలో ఇప్పటివరకు 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు లభించాయి. ఈ సేవల కోసం ప్రభుత్వం ఆసుపత్రులకు మొత్తం రూ.1,590 కోట్లకు పైగా బిల్లులు చెల్లించినట్లు తెలిపారు.

### ప్రైవేట్ ఆసుపత్రులు ఆసక్తితో ముందుకు

ప్రతి నెలా సగటున రూ.100 కోట్ల వరకు ప్రభుత్వం బిల్లుల చెల్లింపులు చేయడంతో ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 461 ప్రైవేట్ మరియు కార్పొరేట్ ఆసుపత్రులు ఈ సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన అన్ని ఔషధాలు కూడా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com


# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 13 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



## స్పోర్ట్స్, స్పేస్ స్టార్టప్‌లు పెట్టేందుకు రండి

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ

దేశంలో స్పోర్ట్స్, స్పేస్ స్టార్టప్‌లు పెట్టేందుకు యువ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఈ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, యువత ఆ దిశగా ఆలోచనలు చేయాలని కోరారు. ఆదివారం 124వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడారు. క్రీడా రంగంలోని స్టార్టప్‌లకు పూర్తి మద్దతు ఇస్తానని తెలిపారు. ఇటీవలి కాలంలో భారత్‌లో చాలా విశేషాలు చోటు చేసుకున్నాయని, అవన్నీ ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. శుభాన్షు శుక్లా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్‌ఎస్)కు వెళ్లి వచ్చాక దేశమంతా ఆనందంతో పొంగిపోయిందన్నారు. అలాగే, చంద్రయాన్-3ని విజయవంతంగా ల్యాండింగ్ చేసిన తరువాత దేశంలో ఓ ప్రత్యేకమైన శాస్త్రీయ వాతావరణం ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు, చిన్నారులు సైతం అంతరిక్ష రంగం మీద ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. దేశంలో విద్యార్థులు స్పేస్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని, ప్రతి విద్యార్థి ఓ కొత్త ఆలోచనతో ముందుకు వస్తున్నారని తెలిపారు. దేశంలో ఐదేండ్ల క్రితం 50 కంటే తక్కువ స్పేస్ స్టార్టప్స్ మాత్రమే ఉండేవని, ప్రస్తుతం స్పేస్ రంగంలో 200 కంటే ఎక్కువ స్టార్టప్స్ ఉన్నాయని వివరించారు. 'ఇన్‌స్పైర్ మనక్ అభియాన్' ఈ పథకం విద్యార్థులు ఆవిష్కరణలు చేసేలా

-మిగతా 2 లో

# స్థానిక తంత్రం

## నేటి మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చ

- ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గర.. బిల్లులు కేంద్రం వద్ద..
- ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించి నిర్ణయం?
- కులగణన, రేషన్‌కార్డుల పంపిణీ, యూరియా నిల్వలు, సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష
- కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక అందితే దానిపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ
- ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపే అవకాశం!

హైదరాబాద్,

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ.. దీనికి ముడిపడి ఉన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సోమవారం మంత్రివర్గ భేటీలో కీలక చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సెక్షన్ 285(ఎ)ను సవరిస్తూ గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ రాజ్‌భవన్‌లోనే ఉంది. అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లులపై ఏ

-మిగతా 2 లో





## హరిద్వార్‌లో ఘోరం

- మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట
- ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు
- కరెంట్ షాక్ పుకారుతో ప్రమాదం? అధికారుల దర్యాప్తు
- రాష్ట్రపతి, ప్రధాని, సీఎం సంతాపం

హరిద్వార్

ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో గల మానసాదేవి ఆలయం వద్ద ఘోరం జరిగింది. ఆలయం మెట్ల మార్గంలో ఆదివారం ఉదయం తొక్కిసలాట చోటు చేసుకున్నది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారు. పలువురికి గాయాలయ్యాయి. ఆరుగురు భక్తులు చనిపోయిన విషయాన్ని హరిద్వార్ జిల్లా కలెక్టర్ మయూర్ దీక్షిత్ ధ్రువీకరించారు. ఇందులో నలుగురు యూపీకి చెందినవారు కాగా ఒకరు ఉత్తరాఖండ్, మరొకరు బీహార్‌కు చెందినవారున్నారు. ఇక గాయపడినవారిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

-మిగతా 2 లో



## కవితపై కేసులు ఎత్తేస్తే పార్టీని విలీనం చేస్తామన్నారు

- బీజేపీలో బీఆర్ఎస్‌ను కలిపేస్తామన్న కేటీఆర్ ప్రతిపాదన నిజమే
- కేటీఆర్‌కు దమ్ముంటే చర్చకు రావాలి
- రమేశ్‌ను నేను తీసుకొస్తా
- కేంద్ర మంత్రి బండి సంజయ్

సుభాష్‌నగర్,

ఎమ్మెల్సీ కవితపై కేసులు ఎత్తేస్తే.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం చేస్తామంటూ ఎంపీ సీఎం రమేశ్ ఎదుట కేటీఆర్ చేసిన ప్రతిపాదన వాస్తవమేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. దీనిపై కేటీఆర్ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తాను వేదిక ఏర్పాటు చేసి సీఎం రమేశ్‌ను తీసుకొస్తానని.. తేదీ, సమయం నిర్ణయించి చర్చకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఆదివారం కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను

-మిగతా 2 లో

## ఆపరేషన్ సిందూర్ పై నేడు లోక్‌సభలో చర్చ

- వాడీవేడిగా జరగనున్నా వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ

వారం రోజుల అవాంతరాలు, ప్రతిష్టంభన అనంతరం సోమవారం నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై పూర్తిగా కేంద్రీకృతం కానున్న ప్రత్యేక చర్చ సోమవారం లోక్‌సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాన్ని సృష్టించే అవకాశం ఉంది. 16 గంటల చొప్పున ఉభయ సభలకు సమయం కేటాయించగా సోమవారం లోక్‌సభ, మంగళవారం రాజ్యసభలో ప్రత్యేక చర్చ ప్రారంభం కానున్నది.భారత్,

-మిగతా 2 లో





## ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానం!

- సిద్ధమవుతున్న అధికార, ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ

అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానానికి కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ సిద్ధం అవుతున్నాయి. ఈ సంవత్సరం బీహార్‌లో కీలకమైన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీనియర్ న్యాయమూర్తుల తొలగింపుతో తనపై ఉన్న అవినీతి ముద్రను తగ్గించుకునేందుకు, 'అవినీతి వ్యతిరేక' సానుకూలతను పెంచుకునేందుకు దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది.

ఇద్దరు న్యాయమూర్తులు, రెండు వివాదాలు

అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో కాలిపోయిన డబ్బుల కుప్పలు కనిపించిన తరువాత ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ ఆయనపై అభిశంసనకు సిద్ధమయ్యాయి. మరోపక్క తనను తొలగించాలని సిఫారసు చేసిన న్యాయవ్యవస్థ అంతర్గత నివేదికను సవాలు చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మితవాద సంస్థ విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తరువాత

-మిగతా 2 లో

## నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయి?

### కాంగ్రెస్ దోపిడీపై నిలదీస్తాం

- నీళ్లు ఏపీ సీఎం చంద్రబాబుకు, నిధులు రాహుల్ గాంధీకి,
- నియామకాలు చంద్రబాబు అనుచరులకు..
- 'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

భూపాలపల్లి/పరకాల

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం.. పదేండ్ల కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ఆదివారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గండ్ర జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. నీళ్లు.. ఏపీ సీఎం చంద్రబాబుకు, నిధులు.. ఢిల్లీలోని రాహుల్ గాంధీకి, నియామకాలు చంద్రబాబు అనుచరులకు వెళ్తున్నాయని తెలిపారు.

-మిగతా 2 లో





## యూరియా బాధ్యత ప్రభుత్వానిదే

- రైతులు ఆందోళన చెందవద్దు: భట్టి
- అభివృద్ధికి మోడల్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాను తీర్చిదిద్దాలి: మంత్రి తుమ్మల
- ఆగస్టు 15 లోగా ఇందిరమ్మ డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ: మంత్రి పొంగులేటి

కొత్తగూడెం,

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం చారిత్రాత్మకమైందన్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అమలవుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎంతోపాటు రాష్ట్ర

-మిగతా 2 లో

## ఎరువుల కొరత సృష్టిస్తున్న కాంగ్రెస్

### మంత్రుల అండతో బ్లాక్‌కు తరలిస్తున్న నాయకులు : రాంచందర్‌రావు

గద్వాల,

'కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువుల కొరతను సృష్టిస్తోంది. మంత్రుల అండతో నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 9 లక్షల టన్నుల యూరియా అడిగితే కేంద్రం 12 లక్షల టన్నులకుపైగా కేటాయించింది. అయినా రైతులు ఎందుకు ఎరువుల దుకాణాల ముందు బారులు తీరుతున్నారు. ఎరువుల కొరతపై వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా ఖమ్మంలోనే చర్చించేందుకు సిద్ధం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



-మిగతా 2 లో

## విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి

- రైతు డిక్లరేషన్ పూర్తిగా నీరుగార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆగస్టు 6న వరంగల్‌లో తెలంగాణ జాగృతి వార్షికోత్సవం : ఎమ్మెల్సీ కవిత

నయీంనగర్

వరంగల్‌లో ఏర్పాటు చేసే విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు దాదాపు 789మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని,



-మిగతా 2 లో

# స్పోర్ట్స్, స్పేస్ స్టార్టప్‌లు పెట్టేందుకు రండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించే కార్యక్రమమని, ప్రతి పాఠశాల నుంచి ఐదుగురిని దీనికి ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డే సందర్భంగా దేశ ప్రజలు తమ సూచనలు, సలహాలు పంపాలని పిలుపునిచ్చారు. ఇందుకు నమో యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

# కవితపై కేసులు ఎత్తేస్తే పార్టీని విలీనం చేస్తామన్నారు

(మొదటి పేజీ తరువాయి)

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనాన్ని నిర్మించామని తెలిపారు. బీసీ డిక్లరేషన్ ముసుగులో ముస్లింలకు ఎక్కువ రిజర్వేషన్లను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతోందని, ఇది ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషన్ అని సంజయ్ మండిపడ్డారు.రాష్ట్రంలో బీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, వారికి అదనంగా 5శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఆ ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని.. అట్లాంటప్పుడు అది బీసీ డిక్లరేషన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో హిందువులను మైనారిటీలుగా చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ముస్లింలను తొలగించి 42శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకు అమలు చేస్తేనే, మద్దతు ఇచ్చి, బిల్లు ఆమోదానికి కేంద్రాన్ని ఒప్పిస్తామని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముస్లిం ఓట్ల కోసమే బంజారాహిల్స్‌లో పెద్దమ్మ గుడిని కూల్చివేశారని సంజయ్ మండిపడ్డారు. బాధ్యులైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రణాళిక ప్రకారం తెలంగాణలో హిందువులను మైనారిటీలుగా చేసే కుట్ర జరుగుతోందన్నారు. తెలంగాణలో బీజేపీ సొంతంగా పోటీ చేయబోతోందని, ఈసారి బీజేపీ అవకాశం ఇద్దామని ప్రజలు ఎదురుచూస్తున్నారని సంజయ్ పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ పై నేడు లోక్‌సభలో చర్చ

(మొదటి పేజీ తరువాయి)

పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం జరగకుండా కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి అ అవకాశాన్ని వినియోగించుకోనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు మొదటివారం ప్రతిపక్షాలు సృష్టించిన రభస కారణంగా వాయిదాల పర్వం కొనసాగింది.

# ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానం!

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనను తొలగించాలని కోరుతూ 55 మంది ఎంపీల బృందం రాజ్యసభకు లేఖ కూడా రాసింది.

**33 శాతం హైకోర్టు పోస్టులు ఖాళీలు**

అయితే, అభిశంసనలు ప్రాధాన్యాంశంగా మారినప్పటికీ, న్యాయవ్యవస్థ దాని సంఖ్యా సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అడిగిన ప్రశ్నకు సమాధానంగా న్యాయ మంత్రిత్వ శాఖ అర్జున్ రామ్ మేఘ్వాల్ సమాధానం ఇస్తూ 371 (33 శాతం) హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మొత్తం 1,122 హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 751 మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న 178 పోస్టులను భర్తీ చేయడానికి ప్రతిపాదనలను ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలిస్తున్నాయి. 193 పోస్టులకు సంబంధించిన సిఫారసులు ఇంకా హైకోర్టు కొలీజియాల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

# యూరియా బాధ్యత ప్రభుత్వానిదే

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెండు జిల్లాల కలెక్టర్‌లు దురిశెట్టి అనుదీప్, జితేష్ పాటిల్ సమీక్షించారు. 2 జిల్లాలో వర్షాభావం, గోదావరికి వరదలు వస్తే తీసుకోవాల్సిన చర్యలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. చారిత్రాత్మక 'ఇందిరమ్మ ఇల్లు' పథకంలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. రైతులకు సరిపడా యూరియా, ఎరువులు సరఫరా చేసే బాధ్యత సర్కారుదేనని రైతులు ఆందోళన చెందొద్దన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా తక్కువ ఉన్నదని జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధికి మోడల్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాను తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి–కొత్తగూడెం జిల్లాలో పలు ప్రాంతాలు వర్షాలు, వరదల వల్ల.. ముఖ్యంగా భద్రాచలం వద్ద గోదావరి నదీ ప్రవాహంతో ముంపునకు గురవుతుందన్న తుమ్మల.. ఇటువంటప్పుడు అవాంఛనీయ ఘటనలు జరక్కుండా ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 15 నాటికి ఇందిరమ్మ డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని, ఆగస్టులో శ్రావణ మాసం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# హరిద్వార్‌లో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

మిగతావారికి జిల్లా ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోందని అధికారులు వివరించారు. ఐదుగురికి తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. ఆలయం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఉన్నతాధికారి వినరు శంకర్ పాండే తెలిపారు. క్షతగాత్రుల్లో ఎనిమిది మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నట్టు తెలుస్తోంది. శ్రావణమాసం నేపథ్యంలో ఉత్తరాదిన ఆలయాలను భక్తులు పెద్ద ఎత్తున సందర్శించుకుంటారు. దీంతో మానసాదేవి ఆలయానికి కూడా ఆదివారం భక్తుల తాకిడి ఎక్కువైంది.

**కారణమేంటి..?**

ఆలయంలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన వెనుక గల కారణాలేంటి అనేదానిపై పోలీసులు, అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం.. ఆలయ మెట్ల సమీపంలో ఓ ఓవర్‌హెడ్ విద్యుత్ వైర్ తెగి నడకదారిపై పడినట్టు ఒక పుకారు వ్యాపించింది. అప్పటికే అక్కడ భక్తులు కిక్కిరిసి ఉన్నారు. దీంతో ఈ పుకారుతో వారిలో గందరగోళం, ఆందోళన నెలకొన్నది. అది కాస్తా తొక్కిసలాటకు దారి తీసినట్టు తెలుస్తున్నది. అయితే విద్యుత్ వైర్ తెగిపడి విద్యుద్ఘాతం జరిగిందా? లేక అది పుకారేనా? అన్న విషయంపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే ఒకరు మాత్రం కరెంట్ షాక్‌కు గురై కాలిన గాయాలతో బాధపడుతున్నట్ట ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మిగతావారంతా తొక్కిసలాట వల్లే గాయపడ్డారని తెలుస్తున్నది.

తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని మోడీ.. బాధను వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి విచారం వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందనీ, అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ పోలీసు విభాగానికి చెందిన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్)తో పాటు స్థానిక పోలీసులు సహాయక చర్యల్లో నిమగమయ్యారని సీఎం తెలిపారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది.

# స్థానిక తంత్రం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయమూ వెలువడలేదు. మరోవైపు రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తయింది. ఏడాదిన్నరకు పైగా స్థానిక ఎన్నికలు జరగక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. వీటన్నింటి నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై మంత్రివర్గం చర్చించనున్నట్టు తెలిసింది. రిజర్వేషన్ల విషయంలో జాప్యం జరుగుతుండటంతో.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయమేదైనా తీసుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కులగణనపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ.. ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక అందించింది. దీనిపై మంత్రివర్గ భేటీలో చర్చించి.. నివేదికలోని వివరాలను వెల్లడించే అవకాశం ఉందని తెలిసింది. ఈ అధ్యయనంలో వెల్లడైన వివరాలు, కులాల వారీగా ఇచ్చిన ర్యాంకులను బట్టి ఏయే చర్యలు తీసుకోవాలనేదానిపైనా ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. పలు ప్రభుత్వ శాఖల్లో కొన్ని పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిసింది.

**యూరియా నిల్వలు.. సాగునీటి ప్రాజెక్టులపై..**

ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందని, తగినంత సరఫరా చేయడం లేదని ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అవసరానికి తగిన మేర యూరియా ఇవ్వడంలేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలో అసలు రాష్ట్రానికి ఖరీఫ్, యాసంగి సీజన్లలో ఎంతెంత యూరియా అవసరం? ప్రస్తుత ఖరీఫ్‌కు కేంద్రం ఎంత కేటాయించింది? ఇప్పటివరకు ఎంత సరఫరా చేసింది? యూరియా నిల్వల విషయంలో తీసుకోవాల్సిన చర్యలేమిటన్న అంశాలపై మంత్రివర్గం సమీక్షించనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, సీతారామ ప్రాజెక్టు సవరించిన అంచనాలపై చర్చించనున్నట్టు తెలిసింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటైన పీసీ ఘోష్ కమిటీ.. ప్రభుత్వానికి నివేదిక అందజేసే అవకాశం ఉందని సమాచారం. మంత్రివర్గ భేటీకి ముందే నివేదిక అందితే దానిపైనా లోతుగా చర్చించనున్నట్టు తెలిసింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వానలు, జలాశయాల్లో నీటి నిల్వ, కొత్త రేషన్‌కార్డులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ అనుసంధానం, మైనింగ్ శాఖలో కీలకమైన సీనరేజీ చార్జీల్లో పలు మార్పులు, అధునాతన గోశాలల నిర్మాణంపై మంత్రివర్గంలో సమీక్షించనున్నారు. పటాన్‌చెరు సిగాచి పరిశ్రమ ప్రమాదంపై విచారణ కమిటీ తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని, దానిపై చర్చించే అవకాశం ఉందని తెలిసింది.

# నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

వీటిపై గొంతు విప్పి ప్రశ్నించాల్సింది కేసీఆర్ దళమేనని, కసితో కొడితే అవతలోడి దిమ్మతిరగాలని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజల సాగు, తాగునీరు సౌలభ్యం కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మూడేండ్లలో కేవలం రూ.80వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్ గురుకులాల్లో 111మంది విద్యార్థులు కల్తీ ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారని అన్నారు. తమ ఇంట్లో పిల్లలకు ఇలాంటి భోజనమే అందిస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ రైజింగ్ అని చెప్పుకుంటున్న ప్రభుత్వం రైజింగ్ ఎందులో ఉందో చెప్పాలన్నారు. రాష్ట్రంలో ప్రతి గురుకులాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలపై సర్వే చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా గండ్ర వెంకట రమణారెడ్డి కొనసాగుతారని తెలిపారు. ఎలాంటి భేషజాలకు పోకుండా పాత, కొత్త అనే తేడా లేకుండా అందర్నీ కలుపుకొని పోవాలని రమణారెడ్డికి సూచించారు. కూర్చున్న చెట్టును నరుక్కోవద్దని, మాతృ సంస్థను కాపాడుకోవాలని కోరారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన, నేటి కాంగ్రెస్ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ చేస్తున్న దోపిడీపై నిలదీస్తాం : కేటీఆర్**

హనుమకొండ జిల్లా పరకాలలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి స్థాపించిన పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ తీసుకున్న పరకాల, నడికూడ మండలాలకు చెందిన 500మంది మహిళలకు కేటీఆర్ కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు సమీపంలో నాలా నిర్మాణం కోసం రూ.160 కోట్ల దోపిడీకి మంత్రులు, ఎమ్మెల్యేలు తెరలేపారని అన్నారు. ఈ వ్యవహారంపై మండలిలో, శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్క్ సమీపంలో కాలువ నిర్మాణానికి జనవరి నెలలో రూ.137 కోట్లతో టెండర్లు పిలిచి టెండరింగ్ పూర్తైందన్నారు. అయినప్పటికీ ఆ పనికి తట్టెడు మట్టి కూడా పోయకుండానే మార్చిలో అదే పనికి ఎస్టిమేషన్ సరిపోదంటూ మరో రూ.160 కోట్లు పెంచుతూ రీ టెండర్స్ పిలవడంలో మతలబేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ సమావేశాల్లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ వికలాంగుల చైర్మెన్ వాసుదేవ రెడ్డి, మాజీ జెడ్పీచైర్మన్ సాంబారి సాంబారావు, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, ఆయా మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం 400 మంది రైతులకు రూ.5 లక్షలు ఇచ్చారని, మిగతా వారికి చట్టపరమైన ఇబ్బందుల వల్ల ఇవ్వలేకపోయారని అన్నారు. మిగతా 389 మందికి తెలంగాణ జాగృతి ద్వారా నెలకు రూ.2500 చొప్పున నాలుగు సంవత్సరాలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను పూర్తిగా నీరుగార్చిందని అన్నారు. రైతు రుణమాఫీ 50శాతం మాత్రమే చేసిందని, రైతు భరోసాను నామమాత్రంగా వేస్తున్నారని ఆరోపించారు. కవులు రైతును పూర్తిగా మరిచారని అన్నారు. పంటలకు మద్దతు ధర ఎక్కడ అని నిలదీశారు. పంట బీమా, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి లింక్ చేస్తామని అంటున్నారని, ఇది సరైంది కదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రైతులను మభ్యపెడుతూనే వస్తుందని అన్నారు. ఆగస్టు 6న జయశంకర్ జయంతిని పురస్కరించుకొని వరంగల్‌లో తెలంగాణ జాగృతి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్య వినయ భాస్కర్, మహిళా అధ్యక్షులు మాధవి, జాగృతి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరత సృష్టిస్తున్న కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)



రాంచందర్‌రావు సవాల్ చేశారు.ఆదివారం జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పర్యటించిన ఆయన.. కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతులకు సాగు నీరు, పెట్టుబడి సహాయం, ఎరువులను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రధాని మోదీ హయాంలో రైతులకు అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని ఎరువుల కొరత తెలంగాణలోనే ఎందుకు ఉందని ప్రభుత్వాన్ని నిలదీశారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉయ్యాలవాడ గురుకుల పాఠశాల విద్యార్థినులను రాంచందర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట ఎంపీ డీకే అరుణ ఉన్నారు.

# కెమెరా లేకుండానే వ్యక్తులను గుర్తించే హూ-ఫై

## సరికొత్త నిఘా టెక్నాలజీ అభివృద్ధి

**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

ఎలాంటి కెమెరాలు అవసరం లేకుండా, విజువల్ ఇన్‌పుట్‌తో పనిలేకుండా వ్యక్తులను గుర్తించే హైటెక్ నిఘా టెక్నాలజీని ఇటలీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఏఐతో పనిచేసే ఈ సాంకేతికతతో వ్యక్తులను, వారి కదలికలను గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. ఈ టెక్నాలజీని హూ-ఫై గా వ్యవహరిస్తున్నారు. సాధారణ వైఫై సిగ్నల్‌ని బయోమెట్రిక్ స్కానర్‌గా ఇది మారుస్తుందని వెల్లడించారు. ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఫేషియల్ రికగ్నిషన్ వంటి సంప్రదాయ బయోమెట్రిక్ సిస్టమ్స్ మాదిరిగా దీనికి ఫిజికల్ కాంటాక్ట్, విజువల్ ఫీడ్ అవసరం లేదు. కేవలం వైఫై సిగ్నల్స్ ద్వారా ఇది పనిచేస్తుంది.



**ఎలా పనిచేస్తుంది?**

వైఫై సిగ్నల్స్‌ని వ్యక్తి అడ్డుకునే తీరును బట్టి ఈ హూ-ఫై టెక్నాలజీతో ఆ వ్యక్తిని గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. వైఫై సిగ్నల్స్ సమీపంలోకి వ్యక్తి వచ్చినప్పుడు, సిగ్నల్ సహజంగా ప్రయాణించే మార్గంలో ఆటంకాలు ఏర్పడతాయి. ఫలితంగా ఒక యూనిక్ ప్యాటర్న్ ఏర్పడుతుంది. చేతి వేలిముద్రలు, ముఖ కవళికలు, రెటీనా నిర్మాణం వంటి బయోమెట్రిక్ సిగ్నేచర్స్ మాదిరిగానే ఇది అత్యంత కచ్చితంగా ఉంటుంది. హూ-ఫై సిస్టమ్ ఈ సిగ్నేచర్‌ను గుర్తించి, వ్యక్తులకు ఆపాదిస్తుంది. ఈ సిగ్నేచర్స్‌పై ఒకసారి దీనికి శిక్షణ ఇస్తే, ఆ వ్యక్తి కదలికలను కనిపెట్టడం మాత్రమే కాకుండా, సుదీర్ఘ కాలం గడచిపోయిన తర్వాత ఆ వ్యక్తి ఆ నెట్‌వర్క్ జోన్‌లోకి తిరిగి ప్రవేశించినపుడు కూడా గుర్తించగలదు. కెమెరాలు, మైక్రోఫోన్లు వంటివాటిని ఉపయోగించవలసిన అవసరం ఉండదు.

**అత్యంత కచ్చితత్వంతో..**

హూ-ఫై సిస్టమ్‌కు సింగిల్ యాంటెన్నా ట్రాన్స్‌మిటర్, త్రీ-యాంటెన్నా రిసీవర్ ఉంటే సరిపోతుంది. అంటే, దీని కోసం ఖర్చు కూడా తక్కువే. టార్గెట్ ఓ గోడ వెనుక ఉండి, సాధారణ వేగంతో నడుస్తున్నప్పుడు, హూ-ఫై సిస్టమ్ 95.5 శాతం కచ్చితత్వంతో గుర్తించగలిగిందని పరిశోధకులు చెప్పారు. ఆ వ్యక్తి బట్టలు మార్చినా, బ్యాక్‌ప్యాక్ ధరించినా ఈ కచ్చితత్వం మారలేదన్నారు.

# పైరసీకి పాల్పడితే మూడేండ్ల జైలు




**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

చలనచిత్ర పరిశ్రమకు పెనుముప్పుగా మారిన డిజిటల్ పైరసీని అరికట్టేందుకు కేంద్రం చర్యలను ప్రారంభించింది. ప్రస్తుతమున్న చట్టాలను సవరించింది. తద్వారా అక్రమంగా, అనధికారికంగా చిత్రాన్ని రికార్డు చేసినా, ప్రసారం చేసినా జైలు శిక్షతో పాటు ఆ చిత్ర నిర్మాణ వ్యయంలో ఐదు శాతం జరిమానాను విధిస్తారు. చిత్రాల పైరసీకి వ్యతిరేకంగా నిబంధలను కఠినతరం చేయడానికి రెండేండ్ల క్రితం సినిమాటోగ్రఫీ చట్టంలో కేంద్రం మార్పులు తెచ్చింది. ఆ సవరణల ప్రకారం పైరసీకి కనీసం మూడు నెలల జైలు శిక్షతో పాటు 3లక్షల జరిమానా విధిస్తారు. అయితే సవరించిన చట్టం ప్రకారం దీనిని మూడేండ్ల వరకు పొడిగింపు లేదా మొత్తం చిత్ర నిర్మాణ వ్యయంలో ఐదు శాతం జరిమానాగా విధించవచ్చునని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి మురుగన్ పార్లమెంట్‌కు తెలిపారు. పైరసీ కారణంగా చలనచిత్ర పరిశ్రమకు 2023లో రూ.22,400 కోట్ల నష్టం వాటిల్లింది.

# బ్రిటిష్ విస్కీకి అతిపెద్ద మార్కెట్‌గా భారత్..

## ఏటా 22కోట్ల లీటర్లు తాగేస్తున్నరు..!


**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

బ్రిటిష్ విస్కీకి ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారు మార్కెట్‌గా భారత్ మారింది. స్కాచ్ విస్కీ అసోసియేషన్ అండ్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్రిటిష్ ఇండస్ట్రీ డేటా ప్రకారం.. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద విస్కీ వినియోగ దేశంగా నిలిచింది. ప్రతి సంవత్సరం 220 మిలియన్ (22కోట్లు) లీటర్లకుపైగా విస్కీని వినియోగిస్తుంది. యూకే నుంచి భారత్ ప్రతి సంవత్సరం దాదాపు రూ.13వేలకోట్ల విలువైన జానీ వాకర్, చివాస్ రీగల్, బాలంటైన్స్, గ్లెన్‌ఫిడిచ్, ది మకాల్లన్ వంటి ప్రీమియం, ప్రామాణిక స్కాచ్ బ్రాండ్‌లను దిగుమతి చేసుకుంటుంది. స్కాచ్ విస్కీపై 150శాతం దిగుమతి సుంకాన్ని క్రమంగా 75శాతానికి, అంతకంటే తక్కువకు తగ్గించడానికి భారత్ అంగీకరించింది. భారత్-యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ ఇందులో భాగంగానే సుంకాన్ని తగ్గించేందుకు భారత్ అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దాంతో భారత మార్కెట్‌లో స్కాచ్ రిటైల్ ధరలు 10 నుంచి 30 శాతం తగ్గుతాయని భావిస్తున్నారు. దాంతో జానీ వాకర్ బ్లాక్ లేబుల్, గ్లెన్‌ఫిడిచ్ వంటి ప్రీమియం విస్కీల ధరలు సైతం సాధారణ వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయి. స్కాచ్ విస్కీ అసోసియేషన్ ప్రకారం.. పన్ను తగ్గింపుతో భారతదేశంలో స్కాచ్ అమ్మకాలు 20నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశాలున్నది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ ప్రకారం.. భారత్ ఏటా రూ. 2.5 లక్షల కోట్లకుపైగా పన్ను ఆదాయాన్ని సంపాదిస్తుంది. ఇందులో ఎక్కువ భాగం విదేశీ బ్రాండ్ల నుంచే వస్తుంది. ధరల తగ్గింపు నేపథ్యంలో కొంత వరకు పన్నులు తగ్గించే అవకాశం ఉంటుందని.. డిమాండ్ పెరుగుదలతో మొత్తం అమ్మకాలు పెరిగి ఆదాయం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.



# పిల్లలను చంపి తిన్న ప్రాచీన మానవులు..


-స్పెయిన్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి



**న్యూఢిల్లీ,-ప్రజా స్వేచ్ఛ**

ప్రాచీన మానవులు నరమాంసాన్ని భుజించేవారని, దాదాపు 8.5 లక్షల ఏండ్ల క్రితం చిన్న పిల్లలను చంపి తిన్నారని స్పెయిన్ పురావస్తు శాస్త్రవేత్తలు తేల్చారు. స్పెయిన్ ఉత్తర ప్రాంతంలోని అటాపుయెర్కాలో గ్రాన్ డోలినా గుహ వద్ద జరిపిన తవ్వకాల్లో పరిశోధకులు దాదాపు 2 నుంచి 4 ఏండ్ల వయసున్న ఓ బాలుడి మెడ ఎముకను కనుగొన్నారు. దానిపై శిరచ్ఛేదన గుర్తులు ఉండటంతో ప్రాచీన మానవులు చిన్న పిల్లలను తిన్నట్టు స్పష్టమవుతున్నదని కాటలాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ పేలియో ఇకాలజీ అండ్ సోషల్ ఇవల్యూషన్ (ఐపీహెచ్‌ఈఎస్) పరిశోధకుల బృందం వెల్లడించింది. ఆ పిల్లవాడి శరీర భాగాలు ప్రాచీన మానవ పూర్వీకుడికి సంబంధించినవని పేర్కొన్నది. ఆ పిల్లవాడి వయసు రీత్యానే కాకుండా మెడ ఎముకపై ఉన్న శిరచ్ఛేదన గుర్తుల కారణంగా కూడా ఇది ఎంతో ముఖ్యమైన కేసు అని ఐపీహెచ్‌ఈఎస్ బృందం సహ డైరెక్టర్ డాక్టర్ పామిరా సలాడీ తెలిపారు. తొలి తరం మానవులు నరమాంసాన్ని భుజంచినట్టు గతంలోనే ఆధారాలు లభించినప్పటికీ చిన్న పిల్లలను చంపి తిన్నట్టు ఆధారాలు లభించడం ఇదే తొలిసారి.

# కాగితంతో అంతరిక్షనౌక



**టోక్యో,-ప్రజా స్వేచ్ఛ**

ప్రపంచంలోని వివిధ దేశాలు నిర్వహిస్తున్న రోదసి ప్రయోగాల వల్ల దిగువ భూకక్ష్యలో వ్యర్థాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు జపాన్ శాస్త్రవేత్తలు సులభమైన పరిష్కారాన్ని చూపారు. అదే 'పేపర్ ప్లేన్' (కాగితపు విమానం). ఇదేమీ జోక్ కాదు. టోక్యో యూనివర్సిటీ పరిశోధకులు ఏ4 షీట్‌తో ఓ పేపర్ ప్లేన్‌ను తయారు చేసి, సిమ్యులేషన్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి ఎగురవేశారు. అంతరిక్ష నౌకల నిర్మాణానికి పూర్తిగా లోహాలపై ఆధారపడాల్సిన అవసరం లేదని, సాధారణ పేపర్ షీట్‌తో కూడా వాటిని తయారు చేసుకోవచ్చని ఈ అధ్యయనం వాదిస్తున్నది. కాగితంతో తయారైన వ్యోమనౌకల వల్ల వ్యర్థాలు ఉత్పన్నం కావని పేర్కొంది.

# ఆ రైతు ఆదాయం ఏడాదికి రూ.3!



**సత్నా-ప్రజా స్వేచ్ఛ**

మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ రైతుకు జారీచేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నది. ఇందులో ఆ రైతు వార్షికాదాయాన్ని కేవలం మూడు రూపాయలుగా చూపించడంతో నెటిజన్లు అతడిని దేశంలోనే అత్యంత పేద రైతుగా అభివర్ణిస్తున్నారు. ఈ విషయం కాస్తా అధికారుల దృష్టికి చేరడంతో అది 'టెక్నికల్ ఎర్రర్' అని వివరణ ఇచ్చారు. సత్నా జిల్లాలోని కోఠి తహసీల్‌లో ఉన్న నయాగామ్ గ్రామానికి చెందిన 45 ఏళ్ల రామ్‌స్వరూప్ పేరుమీద ఈ ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ అయింది. దీనిపై తహసీల్దార్ సౌరభ్ ద్వివేదీ సంతకం కూడా ఉంది. ఈ నెల 22న జారీ అయిన ఈ ఆదాయ ధ్రువీకరణ పత్రం ఫొటో సోషల్ మీడియాకెక్కి తెగ వైరల్ అవుతున్నది.

# మహిళ లివర్‌లో మూడు నెలల పిండం!!



**మీరట్-ప్రజా స్వేచ్ఛ**

వైద్య చరిత్రలో అత్యంత అరుదైన ఘటన ఉత్తరప్రదేశ్‌లో వెలుగుచూసింది. ఒక మహిళకు గర్భాశయంలో కాకుండా కాలేయంలో 12 వారాల పిండం పెరుగుతున్నట్టు గుర్తించారు. బులంద్‌షహర్‌కు చెందిన ఈ మహిళ రెండు నెలలుగా తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు వంటి సమస్యలతో బాధపడుతున్నది. దీంతో తాజాగా ఆమె మీరట్‌లోని వైద్యులను సంప్రదించారు. వారు ఎంఆర్ఐ స్కాన్ తీయడంతో ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆమె కాలేయంలో పిండం పెరుగుతున్నట్టు బయటపడింది. పిండం గుండె కొట్టుకోవడం స్పష్టంగా కనిపించిందని, అంటే అది జీవించి ఉన్నదని, రోజురోజుకు వృద్ధి చెందుతున్నదని డాక్టర్ గుప్తా పేర్కొన్నారు. వైద్య పరిభాషలో దీనిని ఎక్టోపిక్ గర్భం రకంగా పిలుస్తారన్నారు.

# 30న నిసార్ ఉపగ్రహ ప్రయోగం



**న్యూఢిలీ--ప్రజా స్వేచ్ఛ**

శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ నెల 30న సాయంత్రం 5:40 గంటలకు నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. ఈ శాటిలైట్‌ను నాసా-ఇస్రో సంయుక్తంగా రూపొందించాయి. 2,392 కిలోల బరువున్న ఈ శాటిలైట్‌ను జీఎస్ఎల్వీ ఎఫ్-16 రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపించనున్నారు. ఈ ఉపగ్రహ ప్రయోగం కోసం ఎస్‌డీఎస్ఎస్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు.

## శ్మశానవాటిక లేక ఇబ్బందులు..

# లింగాయత్‌లు ఏం చేశారంటే?

**ముంబై -ప్రజా స్వేచ్ఛ**

శ్మశానవాటిక లేకపోవడంతో లింగాయత్‌లు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వినూత్నంగా నిరసన తెలిపారు. ఒక మృతదేహంతో మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ బైఠాయించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అంబజోగై నగరానికి చెందిన లింగాయత్ కమ్యూనిటీ సభ్యులు చాలా కాలంగా బారాఖంబి ప్రాంతంలోని శ్మశానవాటికపై ఆధారపడ్డారు. అయితే ఆ పవిత్ర స్థలాన్ని పురావస్తు శాఖ ఆక్రమించిందని వారు ఆరోపించారు. దీంతో తమ వర్గంలో మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించడానికి తగిన స్థలం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లింగాయత్‌ల కోసం శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు.



## సంపాదకీయం

# ప్రాణం పోద్దాం!



'మేము స్వేచ్ఛగా ఎగిరే పక్షులం. ప్రకృతి హితాన్ని కోరుకునే జీవులం. మా కిలకిలలు అంటే ఇష్టపడని మనుష్యులు ఉండరు. మా బ్రతుకు మేము బతుకుతుంటే మమ్మల్ని మీరు బతకనివ్వడంలేదు' అంటూ పక్షుల మనోభావాన్ని రాస్తాడో రచయిత. 'అడవిలోని ప్రతి జీవి%ూ% అది చెట్టయినా, జంతువైనా, పక్షి అయినా%ూ% నా దృష్టిలో వనదేవతలే' అంటాడు ధూర్జటి. అందుకే ఈ ప్రాచీన కవి ప్రకృతి సౌందర్యాన్ని తన కవిత్వంతో మిళితం చేసి ప్రకృతి ప్రాధాన్యతను వర్ణిస్తాడు. కృష్ణశాస్త్రి, జాషువా, శ్రీశ్రీ, ఆరుద్ర వంటి కవులు సైతం తమ కవిత్వాన్ని ప్రకృతితో అనుసంధానించారు. ప్రకృతిని తమ కవితా సృష్టిలో భాగం చేసుకున్నారు. ప్రకృతి పట్ల ప్రేమను, బాధ్యతను మేల్కొలిపారు. 'తలపై మండే వేడిని భరించి/ ప్రయాణికులకు చల్లని నీడనిచ్చే/ కఠినమైన రాళ్లపై కూడా పెరిగే/ పండులు, పువ్వులను ఇచ్చే/ తమ ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత కూడా తమ శరీరాలను కోయడానికి ఇచ్చే..' అంటూ జంధ్యాల పాపయ్యశాస్త్రి అభివర్ణిస్తాడు. కానీ, కాలం మారడం మొదలైంది. వ్యాపార సంస్కృతితో వచ్చిన మార్పులు ప్రకృతి విధ్వంసానికి కారణమయ్యాయి. మనిషి తనలోని సున్నితత్వాన్ని కోల్పోయి, ప్రకృతికి విరుద్ధమైన జీవితం గడుపుతున్నాడు. దాని ఫలితమే కాలుష్యం వివిధ రూపాల్లో విస్ఫోటనం చెందుతోంది. నాగరికత ప్రకృతికి దూరంగా జరుగుతోంది. అభివృద్ధి పేరుతో పచ్చని పొలాలు, అడవులు వున్న చోట కర్మాగారాలు వెలుస్తున్నాయి. 'అభివృద్ధి అంటే కాంక్రీట్ కట్టడాలు కాదు, పక్షులు తిరిగే ఆకాశం, వాటి ఆవాసాలకు జాగా వుండే భూమి కూడా కావాలి' అంటారు పర్యావరణ శాస్త్రవేత్త వందనా శివ. గత పాతికేళ్లలో మన దేశంలో పక్షుల సంఖ్య 25 శాతం తగ్గిందంటే, అది కేవలం ప్రకృతి పరిహాసం కాదు, మన అజాగ్రత్తకు, నగరీకరణ పేరుతో జరుగుతున్న విధ్వంసానికి సజీవ సాక్ష్యం. ఫలితంగా పక్షిజాతి సంక్షోభంలో పడింది. 204కి పైగా పక్షి జాతులు అంతరించిపోయే దశలో వుండగా, 142 జాతులు ప్రస్తుతం క్షీణిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్(ఎన్‌సిబిఎస్) ఈ మేరకు ఒక నివేదికను వెల్లడించింది. 'మా పరిశోధనలు ఒక భయంకరమైన సత్యాన్ని వెల్లడిస్తున్నాయి. దేశంలోని వైవిధ్యభరితమైన పక్షుల సంఖ్య గణనీయమైన క్షీణతను ఎదుర్కొంటోంది. సమన్వయంతో కూడిన పరిరక్షణ తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతోంది' అంటూ ఎన్‌సిబిఎస్ వన్యప్రాణి జీవశాస్త్రం అధ్యయనవేత్త వివేక్ రామచంద్రన్ చెబుతున్నారు. ప్రపంచ జీవవైవిధ్యం కూడా దారుణమైన స్థితిలో వుంది. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమితి (ఐయుసిఎన్) నిర్వహించిన గ్లోబల్ రెడ్ లిస్ట్ అసెస్‌మెంట్స్‌లో జీవవైవిధ్యం యొక్క అన్ని కోణాలూ క్షీణతను చూపిస్తున్నాయి. తాజా లివింగ్ ప్లానెట్ నివేదిక-2 ప్రకారం క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాలు, చేపలు సంఖ్య 1970 నుంచి సగటున 69శాతం తగ్గాయి. ఇంత విస్తృత స్థాయిలో క్షీణతకు విధ్వంసక భూవినియోగం, ప్రకృతి దోపిడీ, వాతావరణ మార్పు, కాలుష్యం, రసాయనాలు జీవవైవిధ్యానికి హాని కలిగించడమే ప్రధాన కారణం. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు. ఇది జీవవైవిధ్యానికి, భవిష్యత్తరాలకు ప్రమాద సంకేతం. 'పక్షి అరుపు మనకు ఒక హెచ్చరిక. మనం వినకపోతే, రేపటి భూమి శూన్యంగా మారుతుంది' అంటారు భారత పక్షిశాస్త్ర పితామహుడు సలీం అలీ. పక్షుల సంఖ్య తగ్గుదల వ్యవసాయ దిగుబడి తగ్గడానికి దారి తీస్తుంది. హానికరమైన పురుగుమందులపై ఆధారపడటాన్ని తప్పనిసరి చేస్తుంది. ఇది ప్రజారోగ్యంపైన, దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మన చుట్టూ వున్న ప్రతి జీవీ మన జీవితంలో భాగమే. అవి మాయమవకుండా వుండాలంటే మనం మారాలి. కాలుష్యానికి బలైపోయి కనుచూపుమేరలో కనిపించకుండా పోయి% కథా వస్తువుగానో, కవితా వస్తువుగానో మిగిలిపోకుండా పక్షులను రక్షించుకుందాం. 'పక్షులు మన జీవ వ్యవస్థకు సజీవ చిహ్నాలు. అవి లేకపోతే ప్రకృతి సంగీతం మూగబోతుంది' అంటారు ప్రముఖ రచయిత అమితావ్ ఘోష్. పక్షుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, పర్యావరణవేత్తలు, ప్రజలు కలిసి పనిచేయాలి. ప్రకృతిని కాపాడుకోవాలి. కాస్తంత పచ్చదనం పెంచితే, ఎన్నో పక్షి జాతులకు ప్రాణం పోసినవాళ్లమవుతాం.

# చర్చలకు సిద్ధమైన థాయిలాండ్, కంబోడియాలు..

**సురిన్--ప్రజా స్వేచ్ఛ**

సరిహద్దు వివాదానికి ముగింపు పలికేందుకు చర్చలకు సిద్ధమైనట్లు థాయిలాండ్, కంబోడియాలు ఆదివారం ప్రకటించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రయత్నాల మధ్య చర్చలకు ఇరుదేశాలు అంగీకరించినట్లు సమాచారం. ఇరుదేశాల సరిహద్దుల్లో కొనసాగుతున్న కాల్పులు నాలుగవరోజుకి చేరుకున్నాయి. కాల్పుల్లో 33 మంది మరణించగా, 1,68,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారు. తాను థాయిలాండ్, కంబోడియా నేతలతో మాట్లాడానని, కాల్పులు కొనసాగితే ఇరుదేశాలతో వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని సూచించానని ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో శనివారం పేర్కొన్న సంగతి తెలిసిందే. కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి ఇరు దేశాలు అంగీకరించినట్లు పేర్కొన్నారు. తమ దేశం "తక్షణ మరియు బేషరతుగా కాల్పుల విరమణ"కు అంగీకరించిందని కంబోడియా ప్రధాని హున్‌మానెట్ ఆదివారం ప్రకటించారు. థాయ్ తాత్కాలిక ప్రధాని పుమ్తామ్ వెచాయాచారుతో తాను సంభాషించిన తర్వాత థాయిలాండ్ కూడా కాల్పులను నిలిపివేసేందుకు అంగీకరించిందని ట్రంప్ తనతో చెప్పారని అన్నారు. ఇది రెండు దేశాల




ప్రజలకు, సైన్యానికి 'సానుకూల వార్త ' అని హున్‌మానెట్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా విదేశాంగకార్యదర్శి మార్క్ రూబియోతో తదుపరి చర్చలను సమన్వయం చేయడానికి మరియు కాల్పుల విరమణను అమలు చేయడానికి థాయిలాండ్ విదేశాంగ మంత్రితో నేరుగా చర్చలు జరిపేందుకు తన డిప్యూటీ విదేశాంగ మంత్రి ప్రాక్ సొఖోన్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. థాయి ప్రభుత్వం మద్దతు ప్రకటించిందని, తాత్కాలిక ప్రధాని పుమ్తామ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారని థాయి విదేశాంగ శాఖ తెలిపింది. థాయిలాండ్ సూత్రప్రాయంగా కాల్పుల విరమణకు అంగీకరించిందని, కానీ కంబోడియా నుండి విశ్వాసపాత్రమైన చొరవ అవసరాన్ని ఉద్ఘాటించింది.

శాంతియుత పరిష్కారం కోసం అవసరమైన చర్యలను చేపట్టేందుకు త్వరిత ద్వైపాక్షిక చర్చలు జరపాలని పుమ్తామ్ పిలుపునిచ్చారని పేర్కొంది.

**వివాదం ఎలా మొదలైంది :** ఇరు దేశాల మధ్య 817 కి.మీ సరిహద్దు ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రీ విహార్, టా మోన్ థామ్ దేవాలయాలు రెండు దేశాలకు చారిత్రకంగా, సాంస్కృతికంగా పవిత్రమైనవి. అయితే సున్నితమైన ఈ ప్రాంతం సరిహద్దు ఘర్షణలకు కేంద్రంగా మారిపోయింది. గత నెలలో కంబోడియా మాజీ ప్రధానితో ఫోన్ సంభాషణల లీక్ కావడంతో షినవత్రా థాయిలాండ్ అధ్యక్ష పదవి కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇటీవల మందు పాతర పేలి ఇద్దరు థాయి సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి కంబోడియా కారణమని థాయిలాండ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే రెండు దేశాలు పరస్పరం దాడులకు దిగాయి. తమ దేశాల దౌత్యవేత్తలను తిరిగి పిలిపించాయి. గత రెండు దశాబ్దాల నుండి ఉభయ దేశాల నడుమ సరిహద్దు వివాదం నెలకొని ఉంది.

## మైనర్ బాలుడిపై దారుణం.. స్కూల్ బాత్రూమ్‌లో అత్యాచారం



**న్యూఢిల్లీ,-ప్రజా స్వేచ్ఛ**

స్కూల్‌లో మైనర్ బాలుడి పై దారుణం జరిగింది. వాష్‌రూమ్స్ లోకి వెళ్లిన 14 ఏళ్ల బాలుడిపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. దేశ రాజధాని ఢిల్లీ లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 24న సెంట్రల్ ఢిల్లీలోని ఓ స్కూల్ వాష్‌రూమ్‌లోకి వెళ్లిన బాలుడిపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలుడు అదేరోజు తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దాంతో వెంటనే పోలీస్ టీమ్ స్కూల్‌కు వెళ్లి ఎంక్వయిరీ మొదలుపెట్టింది. ఇంతలో బాలుడి పేరెంట్స్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. స్కూల్‌కు వెళ్లిన పోలీస్ టీమ్ నిందితుడిని అరెస్ట్ చేసింది. బాధితుడికి వైద్య పరీక్షలు నిర్వహించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. డాక్టర్ నుంచి మెడికో-లీగల్ సర్టిఫికెట్ అందిన తర్వాత పోలీసులు ఆ బాలుడిపై లైంగిక దాడి జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఢిల్లీలో మైనర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సగటున రోజుకు ఐదుగురు వ్యక్తులు అరెస్టవుతున్నారు. ప్రతిరోజు దాదాపు నాలుగు కేసులు పోక్సో చట్టం కింద నమోదవుతున్నాయి. ఈ గణాంకాలు పిల్లలపై జరుగుతున్న నేరాల తీవ్రతను తెలియజేస్తున్నాయి.

## మోదీతో ఏం జరిగిందో ఆయనే చెప్పాలి..

### ధన్‌ఖడ్ రాజీనామాపై ఖర్గే

**బెంగళూరు -ప్రజా స్వేచ్ఛ**



ఆరోగ్య కారణాలతో ఉప రాష్ట్రపతి పదవికి జూలై 21న జగ్‌దీప్ ధన్‌ఖఢ్ రాజీనామా చేసినప్పటికీ ఆయన రాజీనామాకు కారణాలపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కూ మధ్య అంశమని అన్నారు. అసలైన కారణం ఏమిటనే దానిపై తనకు సమాచారం లేదని చెప్పారు. రైతులకు అనుకూలంగా మాట్లాడినందుకే ధన్‌ఖడ్ బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చిందా అని మీడియా అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ, ఆ విషయాలు తనకు తెలియవని, ఆయన ఎప్పుడూ ప్రభుత్వం పక్షానే ఉండేవారని, అసలు ఏమి జరిగిందనేది ఆయనే చెప్పాలని అన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా జగ్‌దీప్ ధన్‌ఖడ్ తన హయాంలో ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేవారని, కీలక అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలకు తరచు అనుమతి నిరాకరించేవారని ఖర్గే వ్యాఖ్యానించారు. రైతులు, పేదలు, అంతర్జాతీయ అంశాలు, విదేశాంగ విధానం వంటి పలు అంశాలపై ఏరోజూ రాజ్యసభ చైర్మన్‌గా ఆయన తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. దళిత మహిళలు, దళితులు, అట్టడుగు వర్గాలపై అకృత్యాలు, హిందూ-ముస్లిం ఘర్షణల ఘటనలు వంటి అంశాలపై నోటీసులు ఇచ్చి ప్రస్తావించేందుకు ప్రయత్నించినప్పుడు కూడా తమకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదన్నారు. ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారనేది ఆయనకు, మోదీకి మధ్య అంశమని, ఆ కారణం ఏమిటనేది చెప్పాల్సింది కూడా ఆయనేనని అన్నారు.

# 13 ఏళ్ల తర్వాత తొలిసారి మాతోశ్రీలోకి అడుగుపెట్టిన రాజ్ ఠాక్రే

**ముంబై-ప్రజా స్వేచ్ఛ**

మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే 13 ఏళ్ల తర్వాత ఆదివారం తొలిసారి ముంబైలోని మాతోశ్రీలోకి అడుగుపెట్టారు. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సోదరులైన ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలు బాలాసాహెబ్ చిత్రం ముందు ఫొటో దిగారు. 'నా అన్నయ్య శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే పుట్టినరోజు సందర్భంగా, దివంగత గౌరవనీయ బాలాసాహెబ్ ఠాక్రే నివాసం అయిన మాతోశ్రీని సందర్శించా. నా శుభాకాంక్షలు తెలియజేశా' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంఎస్ఎస్ నేతలు బాలా నందగావ్కర్, నితిన్ సర్దేశాయ్ కూడా రాజ్ ఠాక్రే వెంట ఉన్నారు. కాగా, రాజకీయ విభేదాల కారణంగా 2006లో మాతోశ్రీని రాజ్ ఠాక్రే వీడారు. ఆ తర్వాత మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) పార్టీని



ఏర్పాటు చేశారు. 2012లో బాలాసాహెబ్ ఠాక్రే మరణించినప్పుడు చివరిసారి మాతోశ్రీకి ఆయన వచ్చారు. 13 ఏళ్ల తర్వాత తొలిసారి మాతోశ్రీని ఆయన సందర్శించారు. మరోవైపు మహారాష్ట్రలోని ప్రాథమిక స్కూళ్లలో తప్పనిసరిగా హిందీ భాషను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో మరాఠీ గుర్తింపు కోసం పోరాటంలో భాగంగా ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలు రెండు దశాబ్దాల తర్వాత తొలిసారి ఒకే రాజకీయ వేదికపైకి వచ్చారు. వర్లిలో జరిగిన విజయోత్సవ ర్యాలీలో కలిసి ప్రసంగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని వారిద్దరూ నిర్ణయించారు.

# రైతులపై హ్యాకర్ల గురి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

- 'పీఎం కిస్సాన్' పేరిట ఏపీకే ఫైల్
- పీఎం కిసాన్ పథకమే లక్ష్యం
- క్లిక్ చేసి రిజిస్టరైతే ఫోన్ హ్యాక్
- తెలంగాణలో ఆరునెలల్లో రూ.681 కోట్లు తస్కరణ
- దేశవ్యాప్తంగా ఏడాదిలో రూ.22వేల కోట్లు చోరీ
- కేసు నమోదులో సైబర్ క్రైమ్ పోలీసుల చేతివాటం

ఖమ్మం, ప్రజా స్వేచ్ఛ..

సైబర్ నేరగాళ్లు రైతులను టార్గెట్ చేస్తున్నారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన (పీఎం కిసాన్) బదులు పీఎం కిషాన్/ కిస్సాన్ పథకం పేరిట ఏపీకే ఫైల్‌ను వాట్సాప్‌కు పంపించి సెల్‌ఫోన్‌లు హ్యాక్ చేస్తున్నారు. ఎవరి ఫోనైతే హ్యాక్ అవుతుందో ఆ వాట్సాప్‌లోని కాంటాక్ట్స్, గ్రూప్‌లన్నింటికీ ఆ ఏపీకే లింక్ వెళ్తుంది. ఎవరైతే దాన్ని డౌన్‌లోడ్ చేసి రిజిస్టర్ అవుతారో వారి ఎకౌంట్లలో ఎంతుంటే అంత హ్యాకర్లు ఆన్‌లైన్ షాపింగ్‌లు చేస్తున్నారు. క్రెడిట్‌కార్డు యూజర్లను ప్రధాన టార్గెట్ చేసుకొని ఖాతాదారునితో సంబంధం లేకుండా ఓటీపీలు పంపుతూ ఎకౌంట్‌లను లూటీ చేస్తున్నారు. ఎక్కువగా ఫోన్లు, ఇతరత్ర ఆన్‌లైన్ షాపింగ్ చేస్తూ పది నిమిషాలలోపే ఎంపిక చేసుకున్న వస్తువులు డెలివరీ పొందుతున్నారు. ముఖ్యంగా కోల్‌కతా కేంద్రంగా సైబర్ నేరగాళ్లు దోపిడీకి పాల్పడుతున్నట్టు ఆధారాలను బట్టి అర్థమవుతోంది. దేశంలో ఈ ఏడాది రూ. 22వేల కోట్లు సైబర్ నేరగాళ్లు తస్కరించగా, తెలంగాణలో గడిచిన ఆరు నెలల్లో రూ. 681 కోట్లు కొల్లగొట్టారని, దీనిపై 37,958 ఫిర్యాదులు వచ్చినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రైతులు, సామాన్యులే కాదు.. విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, స్టాక్‌మార్కెట్‌పై అవగాహన ఉన్నవారు సైతం సైబర్ నేరగాళ్ల బారినపడుతున్నారు. కొద్దిరోజుల కింద ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఎంఈవో సోదరుడు రూ. 3కోట్లు ఇలా పోగొట్టుకోవటం గమనార్హం.పీఎం కిసాన్ స్కీమ్ కావటంతో రిజిస్టర్ అవుతున్న రైతులు ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా మూడు విడతలుగా రైతులకు రూ. 6వేలు అకౌంట్లలో జమ చేస్తుంది. ఒక్కో విడత రూ. 2వేల చొప్పున ఏడాదికి మూడుసార్లు ఇవి సంబంధిత రైతు ఖాతాలో పడతాయి. అయితే ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి కేంద్రం రకరకాలుగా నిబంధనలు మార్చుతోంది. ఎన్నికల సమయంలో సజావుగా అర్హులైన రైతులందరి ఖాతాలో డబ్బులు జమవుతుంది. ఏ ఎలక్షన్స్ లేనప్పుడు రోజుకో తీరుగా స్కీమ్ నిబంధనలను మార్చుతున్నారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు పీఎం కిసాన్ యోజన స్కీమ్‌ను ఆన్‌లైన్ దోపిడీ కోసం వినియోగించుకుంటున్నారు. పీఎం కిసాన్ యోజనకు బదులు పీఎం కిషాన్/ కిస్సాన్ యోజన ఏపీకే పేరిట మాల్‌వేర్‌తో కూడిన ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే)ను హ్యాకర్లు పంపుతున్నారు. ఈ ఫైల్ ఎవరి ఫోన్‌కైతే సెండ్ అవుతుందో వారితో పాటు ఆ ఫోన్‌లో ఉన్న వాట్సాప్ కాంటాక్ట్‌లన్నింటికీ ఏపీకే వెళ్తుంది. దాన్ని ఓపెన్ చేసి యూనిక్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేయగానే మొబైల్ ఫోన్ హ్యాక్ అవుతుంది. ఫోన్‌ను రిస్టార్ట్ చేసినా వాట్సాప్ హ్యాంగయ్యే ఉంటుంది. అప్పటికే ఆ ఫోన్‌లోని వాట్సాప్ కాంటాక్ట్స్ అనుమతి లేకుండానే ఇతరులకు షేర్ అవుతున్నాయి. తరచూ పీఎం కిసాన్ నిబంధనలు మారుతుండటంతో కొత్త రైతులు పలువురు అప్లరు చేసుకుంటున్నారు. కొందరు అర్హులో కాదోనని, డబ్బులు జమయ్యాయో లేదోనని చెక్ చేసుకుంటున్నారు. ఇదే అదనుగా గత మూడు, నాలుగు నెలలుగా రాష్ట్రంలోని పలువురు రైతుల ఫోన్లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా డబ్బులు కొల్లగొట్టినట్టు బాధితులు చెబుతున్నారు.

### తెలంగాణలో పలువురు రైతుల ఖాతాలు లూటీ

రాష్ట్రంలోని పలువురు రైతుల ఖాతాలను ఇటీవల హ్యాకర్లు లూటీ చేశారు. వాట్సాప్‌కు పీఎం-కేఐఎస్-ఎస్ఏఎన్2.ఏపీకే పేరిట వచ్చిన లింక్‌ను సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ప్రాంతానికి చెందిన ముగ్గురు రైతులు ఓపెన్ చేశారు. పీఎం కిసాన్ యోజన డబ్బులు జమయ్యాయో లేదో తెలుసుకునే ప్రయత్నం చేశారు. దాంతో వారి అకౌంట్ల నుంచి రూ. 32వేలు, రూ. 50వేలు, రూ. 72వేల చొప్పున రూ. 1.59 లక్షలు కట్ అయ్యాయి. వెంటనే బాధితులు బ్యాంకులకు వెళ్లగా అప్పటికే సైబర్ నేరగాళ్లు కాజేసినట్టు చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన బాణోత్ నాగేంద్రప్రసాద్‌కు ఇలాగే పీఎం కిస్సాన్ ఏపీకే లింక్ వచ్చింది. దాన్ని ఓపెన్ చేసిన వెంటనే ప్రసాద్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు నుంచి రూ. 1.80 లక్షలను సైబర్ నేరగాళ్లు తస్కరించారు. ఫ్లిప్‌కార్టు నుంచి ప్రసాద్‌కు ఓటీపీలు వచ్చాయి. పది నిమిషాల్లోపే మూడు మొబైల్‌ఫోన్స్ పర్చేజ్ చేసినట్టు ఇతనికి మెసేజ్‌లు వచ్చాయి. కోల్‌కతాలోని గ్రీన్‌టవర్ ఓఎన్జీసీ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ అడ్రస్‌లో ఉంటున్న రిజ్వాన్‌ఖాన్‌కు ఈ ఫోన్లు ఆర్డర్ పెట్టిన 8 నిమిషాల్లోనే డెలివరీ అయినట్టు మెసేజ్‌లు వచ్చాయి.

### ఏపీకే.ఈఎక్స్ఈ.పీఐఎఫ్ లింక్‌లు ఓపెన్ చేయొద్దు

ఏపీకే.ఈఎక్స్ఈ.పీఐఎఫ్ లాంటి ఎక్స్‌టెన్షన్‌తో ముగిసే లింకులను ఓపెన్ చేయొద్దని, వాటిని మరొకరికి ఫార్వర్డ్ చేసే ముందు ఆలోచించుకోవాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు హెచ్చరిస్తున్నారు. ఫోన్ వినియోగదారునితో సంబంధం లేకుండానే అందులోని వాట్సాప్ నెంబర్లన్నింటికీ ఏపీకే లింక్, డాక్యుమెంట్ వెళ్తుండటం ఆందోళన కలిగిస్తోంది. తమ డబ్బుల తస్కరణపై బాధితులు సైబర్‌క్రైమ్ 1930కి ఆన్‌లైన్ ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు స్థానిక సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు వెళ్లటంతో స్టేషనరీ ఖర్చుల పేరుతో చెరో రూ. 4వేలు ఇవ్వాలని డిమాండ్ చేయటం గమనార్హం.


### పీఎం కిసాన్ న్యూ రిజిస్ట్రేషన్ లింక్ రావటంతో ఓపెన్ చేశా..

పీఎం కిస్సాన్ న్యూ రిజిస్ట్రేషన్ అని ఏపీకే లింక్ వచ్చింది. ఇంతకుముందు పీఎం కిసాన్ డబ్బులు నా ఖాతాలో పడటం లేదు. కాబట్టి ఆ ఏపీకే లింక్‌ను ఓపెన్ చేశాను. వెంటనే నా ఫోన్ హ్యాక్ అయింది. నా ఎస్‌బీఐ వైఫై క్రెడిట్ కార్డు నుంచి ఎలాంటి ఓటీపీలు నేను చెప్పకుండానే రూ. 1.20 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఆ డబ్బులతో మూడు మొబైల్ ఫోన్లు కొనుగోలు చేశారు. సైబర్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వటానికి పోతే రూ. 4వేలు స్టేషనరీ కోసమని అడిగారు.

# పేకాట స్థావరం పై దాడి...

**12 మంది వ్యక్తులపై కేసు నమోదు...**

**కారేపల్లి ఎస్ఐ బైరు గోపి**




కారేపల్లి ,ప్రజా స్వేచ్ఛ

మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోట మైసమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు జరిపిన దాడిలో ఆరు మోటార్ బైకులు 9 సెల్ ఫోన్లు తోపాటు నగదు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామ సమీపంలో గల కోట మైసమ్మ ఆలయ పరిసరాల్లో పేకాట స్థావరంపై దాడి చేశారు.ఈ క్రమంలో ఆ ప్రాంతంలో ఇల్లందుకు చెందిన 12 మంది వ్యక్తులు పేకాడుతూ దొరికారు.వారి వద్ద నుండి 6 మోటార్ సైకిళ్ళు 9 సెల్ ఫోన్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 26 వేల 900 నగదు పట్టుకున్నారు.దీనికి సంబంధించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి గోపి తెలిపారు .ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు భూక్య శంకర్, హరి, ఓంకార్,సైదులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడిగా జి. రాజగోపాల్

**తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ప్రధాన కార్యదర్శిగా కె. మురళీ మోహన్**





హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ

2025 -2027 కాలానికి గాను తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ఎన్నికలు 19.7.2025న జరిగాయి . హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్నికల అధికారి ఎస్. శశిధర్ రెడ్డి ఎన్నికల అధికారిగా ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈరోజు లెక్కింపు పూర్తయింది మరియు ఈరోజు జూలై 27, 2025న ఫలితాలు ప్రకటించబడ్డాయి.

ఖమ్మం ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి జి. రాజ గోపాల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ప్రధాన కార్యదర్శిగా కె.మురళీ మోహన్, ఎన్నికయ్యారు.

ఇతర ఆఫీస్ బేరర్లుగా జె. మైత్రేయి మహిళా ప్రతినిధిగా,


వైస్ ప్రెసిడెంట్-I గా డి. దుర్గా ప్రసాద్,

వైస్ ప్రెసిడెంట్-II గా జి.వేణు,

వైస్ ప్రెసిడెంట్ (మహిళ) గా పి.లక్ష్మీ శారద, డాక్టర్ సిహెచ్. సంపత్, పి.శ్రీదేవి, ఎం.రాజు లు జాయింట్ సెక్రటరీలుగా మరియు జే.ఉపేందర్ రావు , గౌస్ పాషా , కల్పన ఖుష్బూ ,గోపి కృష్ణ , పూజ, హిమబిందు మొత్తం 12 మంది కార్యనిర్వాహక సభ్యులు గా ఎన్నికయ్యారు .

# ఆడోత్ బిక్ష నాయక్ పార్థివ దేహానికి నివాళులు....

**భాస్కర్ రావు..**



మిర్యాలగూడ ,ప్రజా స్వేచ్ఛ

మిర్యాలగూడ నియోజకవర్గ పరిధి దామరచర్ల మండలం కేశవాపురం గ్రామపంచాయతీ పరిధిలో రామోజీ తండా ఆవాసానికి చెందిన ఆడోత్ బిక్ష నాయక్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈరోజు ఉదయాన్నే స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు రామోజీ తండాకు చేరుకొని భిక్షా నాయక్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట దుర్గంపూడి నారాయణరెడ్డి, కూందూరు వీర కోటిరెడ్డి, ఆంగోతు హాతిరాం నాయక్, ఆడోతు లింగ నాయక్, సీతారాములు, ఆదోతు శోభన్ బాబు, భాస్కర్, సందీప్, బాలా నాయక్, మరియు బిక్ష కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఐజ పట్టణంలో డాక్టర్ అబ్దుల్ కలాం గారి 10వ వర్ధంతికి ఘన నివాళులు

ప్రజా స్వేచ్ఛ...

జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో డా. ఏ పి జె అబ్దుల్ కాలాం విగ్రహానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ,1998- 99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆయన వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష శాస్త్ర వేత్త రాజకీయవేత్త మాజీ రాష్ట్రపతి పద్మభూషణ్ పద్మవిభూషణ్ భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం భౌతిక ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నాలుగు దశాబ్దాల పాటు శాస్త్రవేత్తగా సైన్స్ అడ్మినిస్ట్రేటర్గా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ఇస్రో అంతరిక్ష కార్యక్రమం సైన్స్ అభివృద్ధి ప్రయత్నాలు




బాలిస్టిక్ మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా ప్రసిద్ధి చెందాడు. పోక్రాన్ 2 అను పరీక్షలలో అతను కీలకమైన సంస్థాగత సాంకేతిక మరియు అనువర్తన ఆయుధాలు అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించిన రాజకీయ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అన్నిటికంటే మించి ఆయన దేశభక్తుడు భారత మాత సేవలో తరించిన నిజమైన భారతీయుడు అబ్దుల్ కలాం, విద్య స్వాప్నికుడు కళా ప్రేమికుడు నిరంతర శోధకుడు విశ్వమానవుడు మహా దేశభక్తుడు ముగ్గురమ్మల నమ్మిన శాస్త్ర వేత్త తత్వవేత్త నిప్పులు చిమ్ముతూ నింగికేగే క్షిపణి అతడు ప్రేమ నింపుతూ గుండెను తాకి మనిషి అతడుఒక తరం యువ జనాన్ని నడిపించిన సారధి స్వాప్నికుడు విశ్వమానవుడు నిరంతర బోధకుడు శోధకుడు మన త్యాగాలే రేపటి పిల్లల భవిష్యత్తు అని నమ్మిన శాస్త్రవేత్త అబ్దుల్ కలాంగారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు, తూముకుంట కిష్టన్న, భీమ్ ఆర్మీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాష్, భీమ్ ఆర్మీ నాయకులు బలిగెర

## శ్రీ సాయి నగర్ ఈస్ట్ నూతన అధ్యక్షులు గా కృష్ణకాంత్ ఎన్నిక



**మేడిపల్లి, ప్రజా స్వేచ్ఛ**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి శ్రీ సాయి నగర్ కాలనీ( ఈస్ట్ )నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ ఏర్పాటు కోసం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా అధ్యక్షుడిగా కృష్ణకాంత్ ప్రధాన కార్యదర్శిగా సంపత్ కుమార్ గౌడ్ కోశాధికారిగా యాకుబ్ రెడ్డి సంయుక్త కార్యదర్శులుగ శ్రీనివాస్, సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కోటేశ్వరరావు, మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ఉపాధ్యక్ష పదవి కోసం జహంగీర్, స్వామి నాయక్ ఇద్దరు పోటీ పడక ఆదివారం ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో స్వామి నాయక్ 82 వరకు జహంగీర్ కు 15 ఓట్లు వచ్చాయని స్వామి నాయక్ 67 ఓట్ల తేడాతో గెలుపొందారని ఎన్నికల అధికారులు తెలిపారు. నూతన కమిటీ ప్రతినిధులకు నియామక పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా కాలనీవాసులు నూతన ప్రతినిధులను సన్మానించారు.

## చిన్న వ్యాపారాలే సమాజ అభివృద్ధికి భాగ్యసామ్యం
## పిర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి




**మేడిపల్లి. ప్రజా స్వేచ్ఛ**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బిఎస్ఎన్ఎల్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడర్న్ డైరీ పార్లర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరై పార్లర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పాల ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడం ఆరోగ్యకర సమాజానికి బలాన్ని ఇస్తుంది. ఈ డైరీ పార్లర్ లాంటి చిన్న స్థాయి వ్యాపారాలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడమే కాక, ఆర్థికంగా ఆత్మనిర్భరత దిశగా ముందడుగులు వేయించగలవు,స్థానిక యువతను ప్రోత్సహిస్తూ, చిన్న వ్యాపారాల ద్వారా సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మోహన్ కుమార్,మహేష్, మల్లేష్,తిరుమలేష్,అరుణ్, సంగ్రామ్, స్థానికులు తదితరులు పాలొగొన్నారు.

## క్రీడలే మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**క్రిక్ భాక్స్ క్రికెట్ ప్రారంభోత్సవంలో జక్క వెంకటరెడ్డి,**



**మేడిపల్లి ,ప్రజా స్వేచ్ఛ**



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పి అండ్ టి కాలనీ హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ వెనకాల క్రిక్ బాక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి వారు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని నూరిపోసేందుకు ఆటలు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని "క్రీడలు వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా టెక్నాలజీ ఆధారిత జీవనశైలిలో యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచడం అభినందనీయం. భాక్స్ క్రికెట్ వంటి పోటీలతో వారి దేహపుష్టికి తోడు, మానసిక ఉల్లాసం కూడా కలుగుతుంది," అని అన్నారు.
క్రిక్ బాక్స్ఏర్పాటు చేసిన నరేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త కిషోర్ గౌడ్, మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్ గౌడ్, పీర్జాదిగూడ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు పైళ్ల ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# అనునిత్యం ప్రజల కోసమే తపించారు!

**-దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఉన్నత శిఖరం: సీఎం రేవంత్**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ**
దేశ, రాష్ట్ర రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక ఉన్నత శిఖరమని.. ప్రజాస్వామ్యం, రాజకీయాల పట్ల లోతైన అవగాహన ఉన్న వ్యక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.
ఆదివారం కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సీఎం నివాళు లర్పించి.. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతి అంశంపై అద్భుతమైన వాగ్ధాటి, చతురత జైపాల్ సొంతమని.. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా అనునిత్యం ప్రజల కోసమే పనిచేశారని కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్‌రెడ్డి పోషించిన పాత్రను ప్రజలు మరిచిపోలేరని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఎన్నడూ విలువల విషయంలో రాజీపడలేదని, నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా నిలిచారని చెప్పారు. ఆయన ఆశయాలను, ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళిగా సీఎం పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయనకు సీఎం నివాళులర్పించారు.

# వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "దాశరథి

**- సినారెల సాహిత్య సమాలోచన సదస్సు"**

**ప్రజా స్వేచ్ఛ ...**
విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు భాషా చైతన్య సమితి, తెలుగు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావూరి విజయ సదస్సు సంచాలకులుగా "దాశరథి సినారెల సాహిత్య సమాలోచన" అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు జాతీయ సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య పురుషోత్తం, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కె. ప్రభు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి, నాగేశ్వరం శంకరం పాల్గొన్నారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య పురుషోత్తం గారు మాట్లాడుతూ.... యూపీఎస్సీ వాళ్లు నిర్వహించే సివిల్ సర్వీస్ లో కూడా తెలుగును ప్రత్యేకంగా తీసుకొని సివిల్స్ కు సెలెక్ట్ అయ్యే విధంగా పాఠ్యప్రణాళి సిద్ధపరిచి అమలు చేసే విధంగా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఇద్దరు తెలంగాణ మహాకవుల గురించి



సదస్సును ఏర్పాటు చేయడం మంచి పరిణామం అని, ఈ సదస్సులకు ఉన్నత విద్యా మండలి ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు. ప్రారంభ సభకు సభాధ్యక్షులుగా ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి గారు అధ్యక్షత వహించారు.ఇందులో 26 మంది సినారే,దాశరథిల సాహిత్యం పై పత్ర సమర్పణ చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి మాట్లాడుతూ... సాహిత్య అకాడమీ ప్రతిరోజు తెలంగాణ సాహిత్యం మీద సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పుస్తక ప్రచురణలకు తోడ్పడుతుందని, దాశరథి శతజయంతి సందర్భంగా తెలుగు భాషా చైతన్య సమితితో కలిసి 36 వారాలు నిర్విఘ్నంగా ఆన్లైన్ సమావేశాలు నిర్వహించామని, భవిష్యత్తులో ఇదేవిధంగా ఇతర కళాశాలలో, యూనివర్సిటీలలో నిర్వహిస్తామని అన్నారు.అదేవిధంగా సాయంత్రం జరిగిన కవి సమ్మేళనంలో 50 మంది పాల్గొన్న కవులు తమ కవితల్ని పటించారు. ముగింపు సమావేశం తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడేసాబ్ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులుడాక్టర్ నందిని సిద్ధారెడ్డి ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ... దాశరథి ఆవేశంతో, సి.నారాయణరెడ్డి సమన్వయం తో ముందుకు వెళ్లారని, వీరితోపాటు సురవరం ప్రతాపరెడ్డి వట్టికోట ఆళ్వారు స్వామి కాళోజి నారాయణరావులు తెలంగాణ భాష,సాహిత్యం ,సంస్కృతిలో పరిరక్షణలో భాగమయ్యారని అన్నారు. అనంతరం ఈ సభలో పాల్గొన్న కవులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ జాతీయ సదస్సుకు సంచాలకులుగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.విజయ, రామకృష్ణ చంద్రమౌళి, గంటా మనోహర్ రెడ్డి,అర్ధచంద్ర ప్రకాశ్ రెడ్డి, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, డా. రమాదేవి,డాక్టర్ వి కళ్యాణి, డాక్టర్ ఎడ్ల కల్లేష్, డాక్టర్ జయప్రకాష్, నక్క శ్రీనివాస్ యాదవ్, సీరం దాస్ శ్రీనివాస్ ,ప్రజ్ఞా రాజు, రాధాకుసుమ,పాలడుగు సరోజినీ దేవి, దాసోజు పద్మావతి, ఉరిమిళ్ళ సునంద తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డుల పంపిణి

**సిద్దిపేట బ్యూరో...ప్రజా స్వేచ్ఛ**
రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ అక్కన్నపేట రైతు వేదికలో అకన్నపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు, (సీఎంఆర్ఎఫ్ )చెక్కులు, కాటమయ్య కిట్లు మరియు స్టీల్ బ్యాంక్ సామాగ్రి ని అందించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... చాలా కాలంగా ఎదురుచుస్తున్న రేషన్ కార్డులను 10 సంవత్సరాల తర్వాత ప్రజా ప్రభుత్వం అందిస్తుంది. అక్కన్నపేట మండలంలో ఇప్పటికే ఉన్న 2061 రేషన్ కార్డులలో 4369 మందిని చేర్చడం జరిగింది.1403 కొత్త కార్డులను మంజూరు చేయడం జరిగింది వీటిలో సభ్యులు 3032 మందిని ఉన్నారు.పాత పాత కార్డులో చేరిన వారు మరియు కొత్తగా మంజూరైన మొత్తం7401 మందికి ఒక్కొక్కరికి 6 కిలోలు చొప్పున రేషన్ అందిస్తాము.అక్కన్నపేట మండలానికి 519 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినంరాష్ట్రంలోని ఆర్టీసీ బస్సులలో 200 కోట్ల ట్రిప్పులలో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు 6800 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణాలు చేశారు.ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైన రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ఆపలేదు.200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు, సన్న



బియ్యం ఇచ్చినం, మహిళా సంఘాలకు సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు, బస్సులు, మహిళా శక్తి క్యాంటీన్లు, వడ్డీ లేని రుణాలు అందించాము.చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ముఖ్యమంత్రి మహిళా సంఘాలకు మహిళలందరిని కోటీశ్వరులను చేస్తున్నాము. మహిళలు తీసుకునే వడ్డీలేని రుణాలకు ప్రభుత్వం వడ్డీ కడుతుంది.ఆరోగ్య ఇబ్బందులుంటే హైదరాబాద్ లో ఒక మనిషిని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం.ప్రైవేట్ హాస్పిటల్ ల్లలో చేయించుకున్న వైద్య బిల్లులకు మండలంలో 1 కోటి 56 లక్షల రూపాయల విలువైన 443 చెక్కులు అందిస్తున్నాము. ప్లాస్టిక్ వలన క్యాన్సర్ వ్యాధి వస్తుంది.ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఉద్యేశంతో స్టీల్ బ్యాంక్ లు ఇస్తున్నాము. అక్కన్నపేటలో 12 సంఘాలకు ఈరోజు స్టీల్ బ్యాంకులను ఇస్తున్నాము.మిగతా 24 గ్రూపులకు మరో వారంలో స్టీల్ బ్యాంకులు అందిస్తాము.స్టీల్ సామాన్లు వాడండి క్యాన్సర్ లాంటి రోగాల వారిని ప్రజలను రక్షించాల్సిన బాధ్యత మహిళా సంఘాలదే. ప్రతీ ఇంట్లో తులసి, జమ, మునగ, నిమ్మా, కరివేపా మొక్కలను పెట్టుకోవాలి. ప్రజలకు ఆరోగ్యాన్ని పంచె నాటుకోళ్లను పెంచుకోండి. వాటికీ మార్కెటింగ్ కల్పించే భాద్యత నాది.జిల్లా కలెక్టర్ కే. హైమవతి మాట్లాడుతూ...పేద ప్రజలు చాలా కాలంగాఎదురు చూస్తున్న సొంత ఇంటి కల ఇందిరమ్మ ఇళ్లతో తీరుతుంది.మళ్ళీ మళ్ళీ ఇలాంటి అవకాశం రాదు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలి. మండలానికి 1403 రేషన్ కార్డులు మంజూరైనాయి.పాత కార్డులలో 3032 పేర్లు కొత్తగా చేరాయి. మొత్తం 7401 మందికి కొత్తగా రేషన్ సరఫరా చేస్తాము.వడ్డీలేని రుణాలు, కాటమయ్య రక్షణ కిట్లు, స్టీల్ బ్యాంక్ ను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హేమావతి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# దిగి వస్తున్న బంగారం ధరలు.. తెలుగు రాష్ట్రాల్లో ఎంతంటే..

బంగారం ధరలు మళ్లీ దిగి వస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా బంగారం ధరలు క్రమంగా దిగి వస్తున్నాయి. ఇది వరకు తులం బంగారం ధర కొనాలంటేనే లక్ష రూపాయలకుపైగా చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు లక్ష రూపాయలకు దిగువన కొనసాగుతోంది. తాజాగా జూలై 27వ తేదీన ఉదయం 6 గంటల సమయానికి ధరలను పరిశీలిస్తే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,930 రూపాయలు ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91600 వద్ద ఉంది. ఇక 18 క్యారెట్ల పది గ్రాముల ధర 74,950 రూపాయలు ఉంది. ఇక వెండి ధర 1,16,000 రూపాయల వద్ద ఉంది.



**ప్రధాన నగరాల్లో ధరల వివరాలు:**

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99,930 ఉండగా, 22 క్యారెట్ల ధర 91,600

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 10,0080 ఉండగా, 22 క్యారెట్ల ధర 91,750

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99,930 ఉండగా, 22 క్యారెట్ల ధర 91,600

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99,930 ఉండగా, 22 క్యారెట్ల ధర 91,600

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99,930 ఉండగా, 22 క్యారెట్ల ధర 91,600

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99,930 ఉండగా, 22 క్యారెట్ల ధర 91,600

# టీసీఎస్‌లో భారీగా లే ఆఫ్స్.. ఈసారి 12వేల మంది ఔట్..!




కృత్రిమ మేధ రాకతో ప్రయోజనాల సంగతి ఏమోగానీ ఐటీ ఉద్యోగాలపై దీని ప్రభావం మాత్రం గట్టిగానే పడుతోంది. ఏఐ పుణ్యమాని ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు తమ స్టాఫ్‌ను తగ్గించుకుంటున్నాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సైతం భారీగా ఉద్యోగాల కోత కు సిద్ధమైంది. వచ్చే ఏడాది వరకూ తమ స్టాఫ్‌లో 1,200 వేల మందిని తొలగించనుందీ కంపెనీ. ప్రధానంగా మధ్య స్థాయి, సీనియర్ హోదాలోని వాళ్లను ఇంటికి పంపేందుకు సన్నాహకాలు చేస్తున్నట్టు ఆదివారం మనీ కంట్రోల్ వార్తా సంస్థతో కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే.కృతివాసన్ వెల్లడించారు.ఐటీ రంగంలో ఏఐతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. అందులో ఉద్యోగాల్లో కోత కూడా ఒకటి. మెటా సహా పలు సంస్థలు లే ఆఫ్స్ ప్రకటిస్తుండగా.. భారత కంపెనీ టీసీఎస్ కూడా తమ సిబ్బందిని 2 శాతానికి తగ్గించుకునే పనిలో నిమగ్నమైంది. వచ్చే ఏడాది వరకూ దాదాపు 12 వేల మందిని తొలగించేందుకు ప్రణాళికలు చేస్తోంది టీసీఎస్.ఐటీ రంగంలో ఈమధ్య చాలా మార్పులు వస్తున్నాయి. కృత్రిమ మేధ, ఆపరేటింగ్ మోడల్ మార్పులు ఇలా కొత్త సాంకేతికత పుట్టుకొచ్చింది. అందుకు అనుగుణంగానే ఎవరైనా నడుచుకోవాలి. అందుకే లే ఆఫ్స్‌కి సిద్దమవుతున్నాం. అలా అనీ మాకు తక్కువ మందే కావాలని నేను చెప్పడం లేదు. ఇది కేవలం ఒక సర్దుబాటు చర్య మాత్రమే. తొలగించిన వాళ్లకు వేతనంతో పాటు మంచి ప్యాకేజీ ఇస్తాం. నోటీస్ పీరియడ్ సమయానికి జీతం చెల్లిస్తాం. వీటితో పాటు ఆరోగ్య బీమాను కొనసాగిస్తూనే వాళ్లు ఇతర సంస్థల్లో ఉద్యోగం సాధించడానికి అవసరమైన సహకారం అందిస్తాం' అని కృతివాసన్ పేర్కొన్నారు.

# కొటక్ మహీంద్రా ప్రాఫిట్ డౌన్


ముంబై, జూలై 26

కొటక్ మహీంద్రా బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,472 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది నమోదైన రూ.7,448 కోట్లతో పోలిస్తే భారీగా తగ్గింది.రిటైల్ కమర్షియల్ వాహనాలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరడం వల్లనే లాభాల్లో భారీ గండిపడిందని పేర్కొంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.1,200 కోట్ల నిధులను కేటాయించింది.




# అది సెమీఫైనల్ అయినా.. పాకిస్థాన్‌తో ఆడే ప్రసక్తే లేదు..!

ఈ ఏడాది ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయనే వార్తల నేపథ్యంలో మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ మరోసారి తన వైఖరిని వ్యక్తం చేశాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాక్‌తో క్రికెట్ ఆడే ప్రసక్తే లేదని గబ్బర్ తెలిపాడు. ఒకవేళ అది వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సెమీ ఫైనల్ అయినా సరే నేను ఆడను. లీగ్ మ్యాచ్ తరహాలోనే బాయ్‌కాట్ చేస్తాను అని ధావన్ వెల్లడించాడు.పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలతో భారత్, పాక్‌ల మధ్య క్రికెట్ సంబంధాలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఐసీసీ టోర్నీల్లో మాత్రమే ఆడేందుకు ఇరుబోర్డులు అంగీకరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో టీమిండియా మాజీ ఆటగాళ్లు మాత్రం దాయాది జట్టుతో మ్యాచ్ ఆడేందుకు ససేమిరా అంటున్నారు. వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ లెజెండ్స్‌లో భాగంగా జూలై 20 ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేశారు.




ఇకపై కూడా అదే రిపీట్ అవుతుందని అంటున్నాడు ధావన్. చిరకాల ప్రత్యర్థులు సెమీస్ చేరితే అప్పుడు ఏం చేస్తారు? అని మీడియా ప్రశ్నించగా.. గబ్బర్ మాత్రం తన నిర్ణయం మార్చుకోనని స్పష్టం చేశాడు.బ్రదర్.. నువ్వు ఈ ప్రశ్న సరైన ప్రదేశంలో అడగడం లేదు. నేను సమాధానం ఇస్తానేమోనని సరే పదే పదే అడుగుతున్నావు. ఇది వరకూ మ్యాచ్‌లో నేను ఆడలేదు. ఇకపై కూడా అదే జరుగుతుంది' అని ధావన్ కుండబద్ధలు కొట్టినట్టు చెప్పాడు. లీగ్ దశలో పాక్‌తో ఆడబోమని మాజీలు యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్‌లు ఐసీసీకి తెలిపిన విషయం తెలిసిందే.ప్రస్తుతం డబ్ల్యూసీఎల్‌ఎల్‌లో భారత్ రెండు ఓటములతో అట్టడుగున ఉంది. సెమీస్ చేరాలంటే తదుపరి రెండు మ్యాచుల్లో ఇంగ్లండ్, వెస్టిండీస్‌లపై గెలుపొందాలి. టాప్‌లో కొనసాగుతున్న పాక్ సెమీ ఫైనల్ చేరడం దాదాపు ఖాయమే. టీమిండియా ఛాంపియన్స్ గనుక చివరి రెండు మ్యాచుల్లో విజయంతో ముందంజ వేస్తే%ూ% దాయాదుల మధ్య సెమీస్ ఫైట్ జరిగే అవకాశముంది.

# శతకంతో కదం తొక్కిన గిల్.. కోహ్లీ, గవాస్కర్ రికార్డు సమం

కెప్టెన్‌గా తొలి సిరీస్‌లోనే పరుగుల వరద పారిస్తున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాంచెస్టర్ టెస్టులోనూ శతకంతో కదం తొక్కాడు. నాలుగో రోజు నుంచి ఓపికగా క్రీజులో నిలిచిన అతడు.. ఐదో రోజు తొలి సెషన్‌లో సెంచరీ సాధించాడు. క్రిస్ వోక్స్ ఓవర్లో డబుల్స్.. ఆ తర్వాత సింగిల్ తీసి ఈ సిరీస్‌లో నాలుగోసారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు గిల్. కేఎల్ రాహుల్ ఔటయ్యాక వాషింగ్టన్ సుందర్(10)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన సారథి.. జట్టు స్కోర్ 200 దాటించాడు. ఇంకా ఇండియా 101 రన్స్ వెనకబడే ఉంది.

తద్వారా ఒకే సిరీస్‌లో నాలుగు సెంచరీలతో విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్ రికార్డు సమం చేశాడీ హిట్టర్. కెప్టెన్‌గా బ్రాడ్‌మన్, సునీల్ గవాస్కర్ ఒకే సిరీస్‌లో నాలుగు సెంచరీలు బాదారు. ఆ తర్వాత ఎందరో గొప్ప ఆటగాళ్లు వచ్చినా.. గిల్ తరహా విధ్వంసంతో ఈ అరుదైన క్లబ్‌లో చోటు సంపాదించలేకపోయారు. భారత ఆటగాళ్ల విషయానికొస్తే.. గవాస్కర్, విరాట్ కోహ్లీ, యశస్వీలు అతడి కంటే ముందు ఈ ఘనత



సొంతం చేసుకున్నారు.

**సారథిగా 700 రన్స్**

బర్మింగ్‌హామ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలతో కదం తొక్కి సంచలనం సృష్టించిన గిల్.. మరో రికార్డు నెలకొల్పాడు. మాంచెస్టర్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో జట్టును గట్టెక్కించే ఇన్నింగ్స్ ఆడుతున్న సారథి.. 700 రన్స్‌తో చరిత్రకెక్కాడు. ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక రన్స్ కొట్టిన మొట్ట మొదటి భారత కెప్టెన్‌గా గిల్ అవతరించాడు. ఆటగాడిగా చూస్తే.. ఈ ఘనత సాధించినా నాలుగో ఇండియన్‌గా రికార్డు తన పేరిట రాసుకున్నాడీ యువ నాయకుడు.మాంచెస్టర్ టెస్టులో పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును ఆదుకునే పనిలో పడిన గిల్ అర్ధ శతకంతో రాణించాడు. ఈ సిరీస్‌లో 700 పరుగులకు చేరువైన అతడు.. లెజెండ్ సునీల్ గవాస్కర్ రికార్డు బద్ధలు కొట్టాడు. ఇక కెప్టెన్‌గా ఏడొందలకు పైగా రన్స్ చేసిన దిగ్గజాల సరసన నిలిచాడు గిల్. అతడి కంటే ముందు డాన్ బ్రాడ్‌మన్ గ్యారీఫీల్డ్ సోబర్స్, గ్రెగ్ ఛాపెల్, డేవిడ్ గోవర్, గ్రాహమ్ గూచ్, గ్రేమ్ స్మిత్‌లు ఈ మైలురాయిని సాధించారు.

## స్పోర్ట్స్

# రెండొందలు కొట్టినా తప్పని ఓటమి.. సిరీస్‌తో పాటు పరువూ గోవిందా..!




ప్రపంచ క్రికెట్‌లో వెస్టిండీస్ ఒకప్పుడు ఎంతో భయంకరపమైన జట్టు. హిట్టర్లతో, ఆల్‌రౌండర్లతో నిండిన విండీస్ రెండుపర్యాయాలు పొట్టి వరల్డ్ కప్ ఛాంపియన్ కూడా. అలాంటి టీమ్ ఇప్పుడు ఒక్కటంటే ఒక్క విజయం కోసం అపసోపాలు పడుతోంది. సిరీస్ పోతే పోయింది కనీసం ఒక్క మ్యాచ్ అయినా గెలిస్తే చాలు పరువు దక్కుతుంది అనే పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికే ఆస్ట్రేలియా ధాటికి మూడు టీ20ల్లో మట్టికరిచిన షాయ్ హోప్ సేన నాలుగో పోరులోనూ చతికిలపడింది.స్వదేశంలో ఏ జట్టైనా పులిలా గర్జిస్తూ.. ప్రత్యర్థుల భరతం పడుతుంది. కానీ, వెస్టిండీస్ మాత్రం చెత్త ఆటతో వరుసగా సిరీస్‌లు సమర్పించుకుంటోంది. ఇదివరకూ సొంతగడ్డపై ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన విండీస్ ఇప్పుడు ఆసీస్ చేతిలోనూ అదే అవమానానికి చేరువలో ఉంది. టిమ్ డేవిడ్ విధ్వంసక సెంచరీతో మూడో టీ20లో జయభేరి మోగించిన కంగారూ జట్టు.. నాలుగో మ్యాచ్‌లోనూ కరీబియన్ సైన్యాన్ని చిత్తు చేసింది.సెయింట్ కిట్స్‌లో జరిగిన గేమ్‌లో రొవ్‌మన్ పావెల్(28), రొమారియో షెపర్డ్(28)లతో పాటు అందరూ సమిష్టిగా రాణించగా 205 రన్స్ కొట్టింది విండీస్. ఈ మ్యాచ్ అయినా గెలిచి పరువు కాపాడుకుందామనుకున్న హోప్ బృందం ఆశలు ఆడియాసలయ్యాయి.భారీ ఛేదనలో కామెరూన్ గ్రీన్(55 నాటౌట్), వికెట్ కీపర్ జోష్ ఇంగ్లిస్(51) లు చెలరేగి ఆడి లక్ష్యాన్ని కరిగించారు. ఇంగ్లిస్ ఔటయ్యాక అరోన్ హర్డీ(23) ధనాధన్ ఆడడంతో 19.2 ఓవర్లలో ఏడు వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపొందింది. ఇరుజట్ల మధ్య చివరిదైన ఐదో టీ20 జూలై 28న జరుగనుంది.



# సోషల్ మీడియాలో పనిలేనోళ్ళు ఎక్కువయ్యారు


## రకుల్ ప్రీత్ సింగ్

సోషల్ మీడియాలో తరచుగా సెలబ్రిటీలపై ట్రోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ట్రోలింగ్‌లు, ప్రతికూల వ్యాఖ్యలపై నటీనటులు అప్పుడప్పుడు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తునే ఉన్నారు. తాజాగా ఈ విషయంలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో వచ్చే అనవసర విమర్శలపై రకుల్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించింది.రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియా ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. దురదృష్టవశాత్తూ, మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు. వారందరికీ ఉచిత డేటా ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల, ఇతరుల జీవితాల గురించి కామెంట్స్ చేయడం తప్ప వారికి ఇంకేమీ పనిలేకుండా పోయింది" అని అన్నారు. కాగా రకుల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మరోవైపు రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న వేధింపులు, ట్రోలింగ్‌కు అద్దం పడుతున్నాయి. ఉచిత డేటా ప్లాన్‌ల లభ్యత, స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం వల్ల ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు సులభంగా చేరువయ్యారని, అయితే దీనిని దుర్వినియోగం చేసే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఆమె పరోక్షంగా అభిప్రాయపడ్డారు.



# అందరికీ కనెక్ట్ అయ్యే పాత్ర

గబ్బర్‌సింగ్', 'రేసుగుర్రం', 'ఎవడు', 'వాల్తేరు వీరయ్య' వంటి చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు శ్రుతి హాసన్. ఆమె కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. రజనీకాంత్, నాగార్జున, ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్రధారులుగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించారు. ఆగస్టు 14న ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రుతీహాసన్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. "ఓ ఆల్బమ్ కోసం లోకేశ్‌ను కలిసినప్పుడు 'కూలీ'లో నా పాత్ర గురించి చెప్పారు. వినగానే నచ్చేసింది. అందరూ కనెక్ట్ అయ్యే పాత్ర ఇది. మంచి భావోద్వేగాలతో నిండిన ఈ రోల్ నా కెరీర్‌లోనే ప్రత్యేకమైనది. రజనీ సార్‌తో కలిసి నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన పోషించిన దేవ పాత్ర సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది. నాగార్జున విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు. లోకేశ్ విజన్, టేకింగ్ ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. 'కూలీ' ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది" అని చెప్పారు.



# ఓటీటీలోకి 'కానిస్టేబుల్ కనకం'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!


మిడిల్ క్లాస్ మెలోడీస్, పుష్పక విమానం, ఊరు పేరు భైరవకోన సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది బెంగళూరు భామ వర్ష బొల్లమ్మ . ప్రస్తుతం ఆమె టైటిల్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం కానిస్టేబుల్ కనకం. ఈ సినిమాకు ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహిస్తుండగా.. ఈటీవీ ఒరిజినల్స్ నుంచి రాబోతున్న ఈ చిత్రాన్ని కోవెలమూడి సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ సంయుక్తంగా నిర్మించారు. రాజీవ్ కనకాల, మేఘలేఖ, అవసరాల శ్రీనివాస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని పంచుకుంది. ఈ సినిమాను ఆగష్టు 14న ఈటీవీ విన్ వేదికగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అదొక మారుమూల గ్రామం. సాధారణంగా ప్రశాంతంగా ఉండే ఆ ఊరిలో వరుసగా అమ్మాయిలు అదృశ్యమవుతుంటారు. అయితే ఈ కేసును పరిష్కరించడానికి రంగంలోకి దిగుతుంది కానిస్టేబుల్ కనకమహాలక్ష్మి. మరి ఆమె ఈ మిస్టరీని ఎలా ఛేదించిందో తెలుసుకోవాలంటే 'కానిస్టేబుల్ కనకం' వెబ్‌సిరీస్ చూడాల్సిందే.

# ఇన్‌స్టాలో ఆ ఫొటోస్ షేర్ చేసిన సమంత!

టాలీవుడ్ క్వీన్ సమంత గురించి ఎంత చెప్పినా తక్కువే. ఏమాయ చేశావే సినిమాతో వెండి తెరకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అంతే కాకుండా జెస్సీగా తన నటనతో యూత్ ఫేవరెట్ అయిపోయింది.ఇక ఈ సినిమా తర్వాత సామ్‌కు వరసగా స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ రావడం, వచ్చిన ప్రతి సినిమాను చేసి, వరసగా బ్లాక్ బస్టర్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంది. దీంతో ఆ రోజుల్లో టాలీవుడ్ లక్కీ హీరోయిన్‌గా తన సత్తా చాటింది.టాలీవుడ్ స్టార్ హీరోల సినిమాల్లో నటించడమే కాకుండా యాక్షన్ మూవీస్, లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేసి తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది ఈ చిన్నది. సినిమాలే కాకుండా వెబ్ సిరీస్‌లలో కూడా తన నటనావిశ్వరూపం చూపి, తన నటనతో ప్రతి ఒక్కరినీ మెప్పించింది.ఇక ఈ మధ్య ఈ బ్యూటీకి తెలుగులో ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు.ఖుషి, సిడెంటాలా హాలో బన్నీ తర్వాత ఈ ముద్దుగుమ్మ చేసిన సినిమాలు లేవు. కానీ నటిగా కాకుండా నిర్మాతగా మారి శుభం మూవీని నిర్మించి, మంచి హిట్ అందుకుంది. అయితే ఈ మూవీ రిలీజ్ తర్వాత సమంత డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఎక్కువగా కనిపించడంతో, వీరు ప్రేమలో ఉన్నారు త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారు అంటూ అనేక వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే.అయితే ఈ రూమర్స్ వేళ, చాలా రోజుల తర్వాత సమంత తన సోషల్ మీడియా అకౌంట్‌లో తన ఫొటోలు షేర్ చేసింది. సింపుల్ లుక్‌లో, స్లీవ్ లెస్ బ్లౌస్ , శారీలో బ్లాక్ అండ్ వైట్ ఫొటోస్ షేర్ చేసింది. అందులో ఈ చిన్నది చాలా అందంగా, క్యూట్‌గా ఉంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. దీంతో సమంత క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ అభిమానులు.



# కారు కొన్న కోర్ట్ హీరోయిన్ శ్రీదేవి



కోర్టు సినిమాతో సూపర్ క్రేజ్ సంపాదించుకుంది యువ నటి శ్రీదేవి. నాని నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.60 కోట్లు వసూళ్లు చేసింది. ఈ సినిమా సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న శ్రీదేవి ఇటీవలే క్లాసీ ఎంజీ హెక్టార్ కారును కొనుగోలు చేసింది. ఈ విషయాన్నితెలియజేస్తూ సెల్ఫీలు, గ్లింప్స్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది.తన కుటుంబసభ్యులు కారుకు పూజలు చేస్తున్న ఫొటోలను షేర్ చేయడంతో.. నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేస్తూ సందేశాలను పంపిస్తున్నారు. ఇప్పుడీ స్టిల్స్, శ్రీదేవి తమిళంలో డెబ్యూ ప్రాజెక్టుకు ఇటీవలే సంతకం చేసింది. కోలీవుడ్ యువ నటుడు కోటపడి జే రాజేశ్ హీరోగా నటిస్తున్నాడు. శ్రీదేవి తెలుగులో మరోవ కొత్త సినిమా ప్రకటించలేదు. కొత్త కారు కొన్న శ్రీదేవి తనకిష్టమైన ఫన్ రైడ్‌ను ఎంజాయ్ చేయాలని అంటున్నారు ఫాలోవర్లు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492